సంపుటి : 18
సంచిక : 217
Vol : 18
Issue : 217

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

పీపుల్స్‌డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, బుధవారం 28 అక్టోబర్ 2026
Warangal, Wednesday 28 October 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00



www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts



ఎల్‌నినో ఎఫెక్ట్...
విద్యకు విఘాతం!

- ఈసారి ముందుగానే వేసవి సెలవులు
- కరువు దెబ్బకు విద్యా సంక్షోభం తప్పదా?
- తెలంగాణలో పెరుగనున్న ఎండలు, నీటి ఎద్దడి
- వేసవి సెలవులపై మొదలైన చర్చ
- ప్రభుత్వ, ప్రైవేట్ గురుకులాలకు నీటి లభ్యత కష్టమే

2వ పేజీలో..



ఉలిక్కిపడ్డ హైదరాబాద్

నగరంలో భారీ పేలుడు శబ్దం...

భూకంపమా.. పేలుడా? అని జనంలో అయోమయం

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం భారీ శబ్దం వినిపించడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఉదయం 9.15 గంటల సమయంలో ఉప్పర్‌పల్లి, ఎర్రబోడ, లంగర్‌హౌస్, కేశవస్వామినగర్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో ఈ శబ్దం వినిపించింది. దీంతో అసలేం జరిగిందో తెలియక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఎక్కడైనా పేలుడు సంభవించిందా..? లేక భూకంపం వచ్చిందా..? అంటూ స్థానికులు చర్చించుకున్నారు. రాజేంద్రనగర్ పరిసరాల్లో కొన్ని సెకన్లపాటు శబ్దం వినిపించినట్లు (మిగతా 2లో...)



మౌనం వెనుక ఆమ్యామ్యాలు!?



- రెవెన్యూ అధికారులు ఇక మారేదెన్నడు?
- "మావద్ద సమాచారం లేదు" అంటూ ఆర్టీఐ దరఖాస్తుకు రెవెన్యూ సమాధానం!
- ఆధారం లేకుండా సర్వే నంబర్ల మార్పు
- పాస్‌బుక్ సైతం మంజూరు చేసిన తహశీల్దార్ కార్యాలయం!
- ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా మొద్దునిద్ర

పీపుల్స్‌డైరీ – నిఘా టీం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీ నగర్ గ్రామంలో ఒక రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ పాల్పడుతున్న భూ కబ్జాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, దళిత మహిళ భూమి కబ్జా... దళిత హక్కుల హననంపై ఆధారాలతో సహా నిలదీస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం అనుమానాస్పద మౌనం పాటిస్తున్నారు. బాధితులు, గ్రామస్తులు చట్టబద్ధంగా సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వివరాలు కోరితే, కనీస సమాచారం కూడా రెవెన్యూ రికార్డుల్లో లేకపోవడం, (మిగతా 2లో...)

కబ్జాలపై కదలని రెవెన్యూ


- వెల్తుర్లపల్లి భూ ఆక్రమణపై పట్టింపు ఉండదా?
- సబ్ స్టేషన్ భూమి కూడా కబ్జా!?

పీపుల్స్‌డైరీ కథనం తర్వాత కూడా రెవెన్యూ స్పందన శూన్యం..

- డిజిటల్ సర్వేతోనే నిజాలు తేలుతాయంటున్న గ్రామస్తులు..
- రైస్ మిల్లు, సబ్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ భూమి కబ్జాపై సమగ్ర విచారణకు డిమాండ్..

2లో





సీనియర్ ఐఏఎస్ గుడ్‌బై!

2లో

వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రచారం

మృత్యువులా వచ్చిన చిరుత

10లో

- నిద్రపోతున్న కూలీలపై దాడికి యత్నం
- కారు హారన్‌తో కాపాడిన డ్రైవర్...

- బీసీ మహిళలకు గుడ్‌న్యూస్...
- మహిళా స్వావలంబనకు అవకాశం
- స్వయం ఉపాధితో జీవితానికి భరోసా
- కసరత్తు షురూ చేయాలంటూ మంత్రి ఆదేశాలు
- డిసెంబర్ 9 నాటికి అందేలా చర్యలు..!

10వ పేజీలో..

కుట్టు మిషన్ల పంపిణీకి ముహూర్తం!

17 మంది ఖైదీలు పరార్...

- పక్కా ప్రణాళికతో సినీఫక్కీలో ఘటన
- తమిళనాడులోని తేని సబ్‌జైల్ నుంచి తప్పించుకున్న ఖైదీలు
- జైలు సిబ్బందిపై దాడి చేసి పరార్
- తమిళనాడులో రెండో అతిపెద్ద జైల్‌బ్రేక్

పీపుల్స్‌డైరీ–వెబ్‌డెస్క్ : తమిళనాడు రాష్ట్రంలో సంచలన ఘటన చోటు చేసుకుంది. తేని జిల్లాలోని సబ్‌జైలులో.. సోమవారం అర్ధరాత్రి సమయంలో జైలు నిబంధనలు, భద్రతా వలయాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తూ.. ఏకంగా 17 మంది ఖైదీలు ఒకేసారి పారిపోవడం స్థానికంగా పెద్ద ఎత్తున భయాందోళనలను రేకెత్తించింది. ఈ దారుణ ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే అప్రమత్తమైన రాష్ట్ర పోలీస్ యంత్రాంగం తేని జిల్లా సరిహద్దుల నుంచి దిండిగల్ జిల్లా పరిసర ప్రాంతాల వరకు అత్యవసర రీతిలో హైఅలర్ట్ జారీ చేసింది. పారిపోయిన ఖైదీల్లో పోలీసులు అతికష్టమ్మీద నలుగురిని తిరిగి అదుపులోకి తీసుకోగా.. మిగిలిన 13 మంది ఖైదీల ఆచూకీ కోసం పరిసర (మిగతా 2లో...)

మౌనం వెనుక 'ఆమ్యామ్యాలు'...?

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి లావాదేవీలు... భూమికి సంబంధించిన వివరాలు కూడా లేకపోవడం సర్వత్రా అనుమానాలకు దారితీస్తున్నాయి.

ఆర్టీఐ ద్వారా వివరాలు అడిగితే...

'మా దగ్గర సమాచారం లేదు'!

గ్రామంలో జరుగుతున్న ఈ అక్రమ తతంగంపై బాధ్యతాయుతమైన పౌరులు, బాధితులు రెవెన్యూ శాఖకు ఆర్టీఐ దరఖాస్తులు చేయడం జరిగింది. రికార్డుల గల్లంతు వెనుక ఎవరున్నారు? రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ప్రభుత్వం నుంచి పొందిన 5 ఎకరాల భూమి కి సంబంధించిన 204/1/2/2 సర్వేనెంబర్‌కి ఆర్మీ ఆఫీసర్ తన తండ్రి వారసత్వ భూమిగా చెప్పుకొస్తున్న 204/1/2 గల సర్వేనెంబర్ గురించి, గతంలో దశాబ్దాల పాటు పైడిపల్లి ఎర్రయ్య పేరు మీద ఉన్న పహానీలకు సంబంధించిన రికార్డులు... ఏలాంటి లావాదేవీలు, రిజిస్ట్రేషన్లు లేకుండా, ఎలాంటి వారసత్వ ఆధారాలు లేకపోయినా రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ తండ్రి పేరు మీదకు ఎలా మారాయి? లాంటి ప్రశ్నలకు సమాధానం కోరుతూ ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేయగా, "సదరు సర్వే నంబర్లపై మా వద్ద ఎలాంటి సమాచారం లేదు" అంటూ అధికారులు బదులివ్వడం విస్మయానికి గురిచేస్తోంది.

బాధ్యత నుంచి తప్పించుకునే యత్నం:

ప్రభుత్వ కార్యాలయంలో పక్కాగా ఉండాల్సిన ల్యాండ్ రికార్డులు, పహానీ మార్పుల ఫైళ్లు మాయం కావడమో లేదా ఉద్దేశపూర్వకంగా దాచడమో జరుగుతోందని, రెవెన్యూ అధికారుల సహకారం లేకుండా ఇటువంటి అక్రమాలు జరిగే అవకాశం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

5 ఎకరాల సర్వేకు ఎందుకంత భయం?

ఆర్మీ ఆఫీసర్‌కు ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల భూమితో పాటు, ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కొంతమేర ఆయన తన భూమిలో కలుపుకున్నారనే తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

తేల్చాల్సిన బాధ్యత ఎవరిది?

ఆరోపణలు వచ్చిన వెంటనే అధికారులు స్పందించి, సర్వే నంబర్లను కొలవాల్సిన బాధ్యత రెవెన్యూ సర్వేయర్లపై ఉంది. కానీ, ఆ భూమి హద్దులను తేల్చడానికి అధికారులు ఎందుకు ముందుకు రావడం లేదు? అధికారుల ఈ జాప్యం, మౌనవ్రతం చూస్తుంటే సదరు ఆర్మీ ఆఫీసర్ ఒత్తిళ్లకు లేదా ప్రలోభాలకు





రెవెన్యూ యంత్రాంగం తలొగ్గిందనే అనుమానాలు బలంగా బలపడుతున్నాయి.

అధికారుల స్పందనపై ప్రశ్నార్థకం!

ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నా, దళిత మహిళకు దక్కాల్సిన న్యాయం అడుగున పడుతున్నా రెవెన్యూ అధికారులు కళ్ళుండి కూడా చూడనట్లు వ్యవహరించడం పట్ల గ్రామస్తులు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. రికార్డులలో లేని విషయాలను ఉన్నట్లు చూపించి, ఉన్న నిజాలను కనిపించకుండా చేస్తున్న ఈ తంతుపై జిల్లా కలెక్టర్ లేదా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి వివాదాస్పద భూములపై సంయుక్త సర్వే నిర్వహించాలి. ఆర్టీఐ దరఖాస్తులకు స్పష్టమైన సమాచారం ఇచ్చి, రికార్డుల తారుమారుపై అంతర్గత విచారణ చేపట్టాలి. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రభుత్వ ఆస్తిని రికవరీ చేయాలి అని బాధితులు గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తమ మౌనాన్ని వీడి, నిజాలు నిగ్గు తేలుస్తారా? లేక ఈ అక్రమాలకు తెరవెనుక వంత పాడుతూనే ఉంటారా? వేచి చూడాల్సిందే!







కబ్జాలపై కదలని రెవెన్యూ...

- వెల్తుర్లపల్లి భూ ఆక్రమణపై పట్టింపు ఉండదా?
- సబ్ స్టేషన్ భూమి కూడా కబ్జా..!?
- పీపుల్స్‌డైరీ కథనం తర్వాత కూడా రెవెన్యూ స్పందన శూన్యం..
- డిజిటల్ సర్వేతోనే నిజాలు తేలుతాయంటున్న గ్రామస్తులు..
- రైస్ మిల్లు, సబ్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ భూమి కబ్జాపై సమగ్ర విచారణకు డిమాండ్..

వెంకటాపూర్, పీపుల్స్ డైరీ : వెల్తుర్లపల్లి సర్వే నంబర్ 874లో కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణపై 'పీపుల్స్ డైరీ' లో కథనం ప్రచురితమైనా అధికారుల్లో ఇంతవరకు ఎలాంటి స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తాజాగా పక్కనే ఉన్న సబ్ స్టేషన్ కు చెందిన భూమిని కూడా కబ్జా చేశారనే ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి.

ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్ కు గతంలో ఎంత భూమి కేటాయించారు..? ప్రస్తుతం సబ్ స్టేషన్ పరిధిలో ఎంత భూమి ఉంది..? అనేది కూడా సర్వే చేసి విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సబ్ స్టేషన్ కు తీసిన భూమికి, ప్రస్తుతం ఉన్న భూమికి తేడా ఉంటే, మిగతా భూమి ఎటు పోయిందనేది తేల్చాలని కోరుతున్నారు. సబ్ స్టేషన్ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కొందరు ఆక్రమించి, తమ సొంత భూమిగా చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

డిజిటల్ సర్వేతోనే నిజాలు....

ఈ మొత్తం వివాదానికి తెరదించాలంటే ఒక్కటే మార్గం డిజిటల్ సర్వే అని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సర్వే నంబర్ 874లో, సబ్ స్టేషన్ పరిధిలో, రైస్ మిల్లు చుట్టుపక్కల ప్రభుత్వ భూమి ఎంత ఉంది అనేది డిజిటల్ సర్వేతో స్పష్టంగా గుర్తించాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో కొలతలు వేసి హద్దులు నిర్ణయిస్తేనే అసలు నిజాలు బయటకు వస్తాయని అంటున్నారు.

రైస్ మిల్లులో కలిస్తే స్వాధీనం చేసుకోవాలి...

ఈ ప్రభుత్వ భూమికి ఆనుకుని ఉన్న రైస్ మిల్లు పరిధిలో, సబ్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ భూమి కలిసి ఉంటే, వెంటనే రెవెన్యూ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలా స్వాధీనం చేసుకున్న భూమిని ప్రభుత్వ అవసరాలకు, గ్రామ అవసరాలైన బతుకమ్మ స్థలం, పిల్లల పార్క్ లేదా ఇతర ప్రభుత్వ నిర్మాణాలకు వినియోగించాలని సూచిస్తున్నారు.

కబ్జాదారులపై చర్యలుకు డిమాండ్

ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం హెచ్చరికతో వదిలేయకుండా, భూ కబ్జా చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ స్పందించి, సబ్ స్టేషన్ తో సహా మొత్తం ప్రభుత్వ భూమిని డిజిటల్ సర్వే చేయించి, కాపాడాలని వేడుకుంటున్నారు.





ఎల్‌నినో ఎఫెక్ట్.. విద్యకు విఘాతం..!?

- ఈసారి ముందుగానే వేసవి సెలవులు
- కరువు దెబ్బకు విద్యా సంక్షోభం తప్పదా?
- తెలంగాణలో పెరుగనున్న ఎండలు, నీటి ఎద్దడి
- వేసవి సెలవులపై మొదలైన చర్చ
- ప్రభుత్వ, ప్రైవేట్ గురుకులాలకు నీటి లభ్యత కష్టమే

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : గత కొద్ది రోజులుగా తెలంగాణ ప్రభుత్వాన్ని, ప్రజల్ని టెన్షన్ పెడుతున్న ఒకే ఒక్క అంశం ఎల్ నినో కరువు. ఎల్ నినో ప్రభావం కారణంగా రానున్న రోజుల్లో తీవ్రమైన గడ్డు పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. జులై వరకు ఎండల తీవ్రతతో పాటు నీటి ఎద్దడి పెరిగే ప్రమాదముందని, అందువల్ల ప్రజలు ప్రతి బొట్టు నీటిని, విద్యుత్‌ను ఎంతో పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు గణనీయంగా పడిపోవటం, భూగర్భ జలాలు ఇంకిపోవడం వల్ల తాగునీటి సమస్య తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. మరోవైపు ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరడంతో ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వినియోగం పెరిగి విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుకుంటుంది. ముందస్తు ప్రణాళికతో నీటిని, విద్యుత్‌ను నిర్వహించుకోవడంతో పాటు ప్రభుత్వ సూచనలను పాటిస్తేనే ఈ వేసవి సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలమని ప్రభుత్వం భావిస్తోంది.

ఇప్పుడు ఈ ఎల్ నినో ఎఫెక్ట్ విద్యార్థులపైనా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎల్ నినో కారణంగా మండే ఎండలు, తీవ్రమైన నీటి ఎద్దడి కారణంగా ఈ విద్యాసంవత్సరంలో ముందుగానే వేసవి సెలవులు వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. బెంగళూరులో మాదిరిగా.. హైదరాబాద్ నగరంలోనూ భూగర్భ జలాలు అడుగంటి పోయాయని తెలుపుతున్నారు. అర్నబ్ తుపాన్ కారణంగా ఏపీలో వర్షాలు కురుస్తున్నా.. దాని ప్రభావం తెలంగాణపై తక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ చెప్పింది. డిసెంబర్ 14 తరువాత హైదరాబాద్ వాతావరణం పొడిగా ఉంటుందని వెల్లడించింది.

'నీటి ఎద్దడి కారణంగా హైదరాబాద్ నగరంలో బడులు, విద్యా సంస్థలు మార్చ్ తరువాత నడపడం కష్టమైపోయే పరిస్థితి కన్పిస్తోంది. ప్రభుత్వం వేసవి సెలవుల్ని ముందస్తుగానే ప్రకటిస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అలాంటి ప్రకటన ఏదీ ప్రస్తుతానికి రాలేదు. కానీ అవకాశం ఉంది. మరి సిలబస్ పూర్తి చెయ్యడం ఎలా అనే అనుమానం రావచ్చు. నీరు, విద్యుత్ కొరత కార ణంగా బహుశా మార్చి మొదటి వారానికి ప్రభుత్వం ఆన్‌లైన్ క్లాసులు పెట్టుకోండి అని చెప్పొచ్చు. ఆన్‌లైన్ క్లాసులంటే తిరిగి పిల్లల చేతికి మొబైల్.. వారు పాఠాలు వినేది ఏమీ ఉండదు.. మొబైల్‌కు అడిక్ట్ అయిపోతారని చాలా మంది పేరెంట్స్ బాధపడుతున్నారు. పెద్దపెద్ద గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చాలా మంది విద్యార్థులు ఉంటారు కాబట్టి వారికి నీటి వసతి కల్పించడం కత్తిమీద సామే అవుతుంది.



ఉలిక్కిపడ్డ హైదరాబాద్ వాసులు

(మొదటి పేజీ తరువాయి)

స్థానికులు తెలిపారు. ఏం జరిగిందో తెలియక అయోమయానికి గురయ్యామని వెల్లడించారు. అయితే భారీ శబ్దానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఈ ఘటనపై నగర పోలీసులు ఆరా తీస్తున్నారు. శబ్దం ఎక్కడి నుంచి వచ్చింది ? ఏదైనా పేలుడు జరిగిందా ? అనే కోణాల్లో స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఒకేసారి శబ్దం వినిపించడంతో దాని మూలాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణ పనులు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణంలో భాగంగా సెల్లార్లు, పునాదుల తవ్వకాల సమయంలో అడ్డుగా ఉన్న బండరాళ్లను తొలగించేందుకు కొందరు అనధికారికంగా జిలిటెన్ స్టిక్స్‌తో పేలుళ్లకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తాజాగా వినిపించిన భారీ శబ్దానికి కూడా ఇలాంటి చర్యలే కారణమై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. అయితే, ఈ అనుమానాలకు సంబంధించి పోలీసుల నుంచి అధికారిక ప్రకటన రాలేదు. పోలీసులు ఈ కోణంలోనూ విచారణ చేపట్టి, ఘటనకు అసలు కారణాన్ని గుర్తించే పనిలో ఉన్నారు. నిర్మాణ పనుల్లో అనుమతి లేకుండా పేలుడు పదార్థాలను వినియోగించడం ప్రజల భద్రతకు ముప్పుగా మారే అవకాశం ఉంది. ఇలాంటి చర్యలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఘటనపై పోలీసులు చేపట్టిన విచారణలో పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. మట్టత్తంగా ప్రశాంతంగా ఉన్న నగరంలో ఈ భారీ శబ్దాలు ప్రజల్ని ఉలిక్కిపడేలా చేశాయి.

17 మంది ఖైదీలు పరార్...



(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లో తీవ్రంగా గాలిస్తున్నారు. జైలులోని ఒక సెల్‌లో ఉన్న కొందరు ఖైదీలు తప్పించుకునేందుకు తొలుత పక్కా పథకం వేశారు. అందులో భాగంగానే ఒక ఖైదీ తనకు తీవ్రమైన మూర్ఛ వ్యాధి వచ్చినట్లుగా నటిస్తూ... గట్టిగా కేకలు వేశాడు. ఖైదీ పరిస్థితి విషమించిందనే భ్రమలో, ఆపదలో ఉన్నాడనే మానవత్వంతో సెల్ తలుపులు తెరిచి లోపలికి ప్రవేశించిన జైలు సిబ్బందిపై లోపల ఉన్న ఖైదీలంతా ఒక్కసారిగా తిరగబడ్డారు. రక్షణగా ఉన్న సిబ్బందిపై భౌతిక దాడికి దిగి, వారిని తీవ్రంగా గాయపరచి సెల్ నుంచి బయటకు వచ్చి జైలు ప్రాంగణం దాటి పరారయ్యారు. ఖైదీల దాడిలో గాయపడిన భద్రతా సిబ్బందిని తక్షణమే సమీపంలోని ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నారు.

అయితే మొత్తంగా 17 మంది ఖైదీలు పరారు కాగా.. అందులో నలుగురిని పోలీసులు వెతికి పట్టుకున్నారు. మిగతా 13 మంది ఖైదీలు.. ప్రధాన మార్గాలు, రహదారులపై దాదాపు 16 వ్యూహాత్మక ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పరారైన ఖైదీలు జైలు వెనుక భాగంలో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంలోకి ప్రవేశించి ఉంటారని అధికారులు బలంగా అనుమానిస్తున్నారు. ఈక్రమంలోనే గాలింపు చేపడుతున్నారు. అయితే ఈ ఊహించని పరిణామంపై సౌత్ జోన్ ఐజీ విజయేంద్ర బిదారీ స్పందిస్తూ.. పరారైన ఖైదీల కోసం ప్రత్యేకంగా 17 గాలింపు బృందాలను రంగంలోకి దించినట్లు స్పష్టం చేశారు. అడవులు, సరిహద్దు ప్రాంతాలను పూర్తిగా జల్లెడ పడుతున్నామని, మిగిలిన నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

సీనియర్ ఐఏఎస్ గుడ్‌బై!

వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రచారం

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వంలో మరో సీనియర్ ఐఏఎస్ అధికారి స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నట్లు వస్తున్న వార్తలు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మాజీ ఐఏఎస్ సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ బాటలోనే జయేష్ రంజన్ ప్రభుత్వ సర్వీసు నుంచి వైదొలిగి ప్రైవేటు రంగంలోకి వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అమెరికాకు చెందిన ప్రముఖ సంస్థలో ఉన్నతస్థాయి బాధ్యతలు చేపట్టేందుకు ఆయనకు అవకాశం లభించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. 2027 సెప్టెంబరులో పదవీ విరమణ చేయాల్సి ఉన్న జయేష్ రంజన్ సుమారు పది నెలల ముందుగానే సర్వీసు నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆయన దరఖాస్తును కేంద్రంలోని సిబ్బంది, శిక్షణ శాఖ (డీవోపీటీ)కి పంపినట్లు సమాచారం. ఈ పరిణామం రాష్ట్ర సచివాలయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. అయితే.. వీఆర్ఎస్ దరఖాస్తు వెనుక కారణాలు, ఆయనకు లభించినట్లు చెబుతున్న ఉద్యోగ అవకాశం వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.



ఐటీ, పరిశ్రమల రంగాల్లో కీలక పాత్ర

జయేష్ రంజన్ తెలంగాణలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్య శాఖల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ముఖ్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ శాఖలో సుదీర్ఘకాలం పనిచేశారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, అంతర్జాతీయ సంస్థలతో సమన్వయం, ఐటీ రంగ విస్తరణ వంటి అంశాల్లో ప్రభుత్వ యంత్రాంగంలో కీలక అధికారిగా వ్యవహరించారు. పరిశ్రమల శాఖ బాధ్యతలను కూడా పర్యవేక్షిస్తూ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యారు. సమాచార, పౌర సంబంధాల శాఖతో పాటు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు సంబంధించిన అదనపు బాధ్యతలను సైతం గతంలో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయన కీలక అధికారిగా కొనసాగుతున్నారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
బుధవారం, 28 అక్టోబర్ 2026
సంపుటి : 18, సంచిక : 219

ఎల్‌నినో ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలు

● గౌని ఐలయ్య ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మహబూబాబాద్-అక్టోబర్ 27(పీపుల్స్ డైరీ) : ఈసారి ఎల్ నినో ప్రపంచంపై తీవ్ర ప్రభావం చూపించబోతోందని, మన దేశంలో దీని ప్రభావ తీవ్రత చాలా ఎక్కువగా ఉండబోతుందని అనేక నివేదికలు తెలియజేస్తున్నాయి.గత 150 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా గాడ్జిల్లా స్థాయి దాటి 1876–78 నాటి ఎల్ నినో కంటే ప్రమాదకరమైన సూపర్ డూపర్ ఎల్ నినోగా మారబోతోందని అమెరికాకు చెందిన వరల్డ్ మెటియోరాలిజికల్ ఆర్గనైజేషన్ తో పాటు శాస్త్రవేత్తలు చెపుతున్నారు. కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం కూడా పసిఫిక్ మహాసముద్రపు ఉపరితల జలాల ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయికి చేరినట్లు వెల్లడైంది. ఈవిపత్తు కారణంగా మన దేశంలో తీవ్ర అనావృష్టి పరిస్థితులు ఏర్పడతాయని, రాబోవు మూడు నెలల్లో దీని తీవ్రత ఎక్కువగా ఉంటుందని కూడా చెప్తున్నారు.ఇప్పటికే ఎల్ నినో కారణంగా ఉష్ణోగ్రతలలో గణనీయంగా మార్పులు సంభవించి పర్యావరణ సమస్యలు, అనారోగ్య సమస్యలు కూడా సంభవిస్తాయి.

ఎల్ నినో అంటే ఏమిటి?

భూమధ్యరేఖ వెంబడి దక్షిణ అమెరికా ఖండం పశ్చిమ తీరం వైపు విస్తరించి ఉన్న పసిఫిక్ మహాసముద్రం జలాలు అతిగా వేడెక్కితే సముద్ర గాలులు పశ్చిమానికి బదులుగా తూర్పునకు పయనిస్తాయి.దీనినే ఎల్నినో అంటారు.దీని ప్రభావంతో రుతు పవనాల గతి తప్పి కొన్ని ప్రాంతాలలో అనావృష్టి,తీరప్రాంత దేశాలలో అతివృష్టి సంభవిస్తాయి.పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వలన ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు అనారోగ్యాల బారిన పడతారు. విధ్వంసకర అభివృద్ధి, నియంత్రణ లేని పారిశ్రామిక విధానాలు,శృతి మించిన శిలాజ ఇంధనాల దహనం తదితర మానవ తప్పిదాల కారణంగా గ్లోబల్ వార్మింగ్ పెరిగి పర్యావరణం ధ్వంసం అవుతున్నది.అందులో భాగంగానే భూమి, సముద్ర జలాలు కూడా వేడెక్కటం, తద్వారా ఎల్నినో లాంటి విపత్తులు సంభవిచటం జరుగుతున్నాయి. సముద్ర జలాలు 0.5 డిగ్రీల సెల్సియస్ వరకు పెరగటం సాధారణమే. ఉష్ణోగ్రతలు ఈ బెంచ్ మార్కు దాటితే ఎల్నినోగా ప్రకటిస్తారు.

0.5 డిగ్రీల సెల్సియస్ నుండి 1 డిగ్రీ వరకు ఉష్ణోగ్రత ఉంటే బలహీన ఎల్నినో , 1 డిగ్రీ సెల్సియస్ నుండి 1.5ళీ సెల్సియస్ వరకు నమోదైతే మధ్యస్థ ఎల్నినోగా, 1.5 నుండి 2ళీ ఫ నమోదైతే బలమైన బలమైన ఎల్నినోగా, 2 డిగ్రీల నుండి 3 డిగ్రీల వరకు ఉంటే సూపర్ ఎల్నినోగా, 3 నుండి 3.5 డిగ్రీల వరకు ఉంటే గాడ్జిల్లా ఎల్నినోగా, 3.5 కంటేపైన ఉంటే దానిని సూపర్ డూపర్ ఎల్నినోగా పిలుస్తారు. ప్రస్తుత ఎల్నినో డిసెంబర్ చివరి నాటికి పతాక స్థాయికి రూపాంతరం చెందే అవకాశం 82% ఉన్నదని, ఇది 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉన్నదని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.దేశవ్యాప్తంగా సాధారణ వర్షపాతం కంటే ఈ సంవత్సరం వర్షపాతం తగ్గింది.రాష్ట్రం మొత్తంలో అక్టోబర్ 15 నాటికి 23 శాతం లోటు వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 740.6 మిల్లీమీటర్లు కాగా ఈ సంవత్సరం 615.5మిల్లీ మీటర్లు వర్షపాతం మాత్రమే కురిసింది. రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత దశాబ్ద కాలంలో ఏనాడూ లేనంతగా తగ్గిపోయాయి. గత ఏడాది సెప్టెంబర్ 30 నాటికి ప్రధాన రిజర్వాయర్లలో 848.17 టీఎంసీలు నీరు ఉండగా ఈ ఏడాది అది కేవలం 475.57 టీఎంసీలకు పడిపోయింది. భూగర్భ జలాలు కూడా అడుగంటాయి. మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట తదితర జిల్లాల్లో 11 మీటర్ల లోతు వరకు భూగర్భ జలాలు తగ్గిపోయాయి. దీనివలన బోర్లు, బావులు ఇంకిపోతున్నాయి.తెలంగాణలో 18 జిల్లాలలో 320మండలాల్లో కరువు పరిస్థితులు మరింత తీవ్ర స్థాయిలో వున్నాయి.12760 గ్రామాలకు గాను 11479 గ్రామాలలో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసినట్లు రికార్డులు చెపుతున్నాయి.ఈ ప్రాంతాల్లో 20 నుండి 59% వరకు తక్కువ వర్షపాతం నమోదయింది. ఇప్పటికే 12లక్షల ఎకరాలలో పంట నష్టం జరిగింది. దీనిని బట్టి రాష్ట్రంలో ఎంతటి తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయో అర్థం చేసుకోవచ్చు.ఈ మేరకు ప్రాథమిక నివేదికలు కూడా అందినట్లు ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు ప్రకటిస్తున్నారు. వంశపాతం లోటు భారీగా వుండటంతో బావులు, బోరుబావులు, ఇతర వనరుల కింద నీరు ఇంకిపోవటంతో వాటి ఆధారంగా వేసిన పైర్లు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి.చాలాచోట్ల రైతులు ఇప్పటికే వేసిన పైర్లను పశువుల మేతకు వదిలేశారు.మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లుగా కరెంటు కోతలు, చార్జీల పెంపు భారంగా మారింది.చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్న పైర్లను వున్న కొద్దిపాటి నీటి వనరులతో బ్రతికించు కొందామన్నా లెక్కా పత్రం లేని కరెంటు కోతల వలన పైర్లు తడవటం లేదు. దీనికి తోడు లోఓల్టేజి కరెంటు సప్లై కారణంగా మోటార్లు కాలిపోతున్నాయి. ఇది చాలదన్నట్లు ట్రూఅప్ చార్జీల పేరుతో 7635 కోట్ల రూపాయల రికవరీకి, అందులో 5420 కోట్ల రూపాయలు ప్రజల నుండి వసూలు చేసుకోవడానికి డిస్కంలకు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది.ఈమేరకుఈ నవంబర్, డిసెంబర్ మాసాల నుండి యూనిట్ కు 50 పైసల వరకు కరెంటు చార్జీలు పెరగనున్నాయి. కరువు పరిస్థితుల ముంచుకొస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా ఇప్పుడు 'ఎంత రేటు పెట్టి అయినా కొందామంటే దేశంలో కరెంటు దొరకడం లేదని ' ప్రభుత్వం వాపోతున్నది. దాహం వేసినప్పుడే బావి తవ్వుకుందామన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వైఖరి వుంది.ఎల్ నినో లాంటి ప్రకృతి విపత్తుల సందర్భంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.రెండు ప్రభుత్వాలు ఇప్పటిదాకా దీన్ని పట్టించుకోలేదు. గత రెండు నెలలుగా కరువు తీవ్రత పెరుగుతూ వస్తున్నా,రైతాంగ ఆందోళనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. పైగా డేటా సెంటర్లకు, ఇథనాల్, పెప్సీ, బీర్లు తదితర పరిశ్రమలకు వ్యవసాయ భూములను,నీటిని కేటాయిస్తున్నారు. అవి విడుదల చేసే కాలుష్యంపై ప్రజలు ఆందోళన చేస్తున్నా ఖాతరు చేయకుండా ప్రోత్సాహిస్తున్నారు. కరువు తీవ్రత పెరిగిన తర్వాత ఇప్పుడు మేల్కొని "ఎల్ నినో ప్రభావం వలన రాబోయే రోజుల్లో మంచినీటికి కూడా ఇబ్బంది ఏర్పడుతుందని,ఎట్టి పరిస్థితుల్లోనూ రబీలో పైర్లు వేయకుండా క్రాప్ హాలిడే అమలు చేయాలని" ప్రకటనలు చేస్తున్నారు. కరువు సహాయక ప్యాకేజీ ఇవ్వాలని, ఉపాధి పనులు చేపట్టాలని కేంద్రాన్ని కోరినట్లు ప్రకటించి చేతులు దులుపుకుంటున్నారు. జాగ్రత్తలు సరే, రైతు కూలీల బతుకుదెరువు పరిస్థితి ఏమిటి? క్రాప్ హాలిడే అమలు చేస్తే వారి జీవనోపాధికి ప్రభుత్వం ఇచ్చే భరోసా ఏమిటి? సేద్యం బందు పెడితే దానిపైనే ఆధారపడి జీవిస్తున్న రైతుకూలీలు,ఇతర వృత్తులలో వున్న గ్రామీణ పేదలు వీధిన పడతారు.వారి జీవనోపాధికి ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలి.ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండి కరువును ఎదుర్కోవడానికి నిర్దిష్ట చర్యల ఊసే లేదు. ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం పేర అక్టోబర్ 22 నుండి నవంబర్ 30 వరకు గ్రామాలలో సర్వే నిర్వహిస్తారని వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటిస్తున్నాడు. ఇప్పటికే కరువు కోరల్లో చిక్కివెలవిలాడుతున్నారు. ప్రజలను ఆదుకోవాల్సింది పోయి సర్వేల పేరుతో ఇంకా కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా తక్షణమే కరువు సమస్యపై రైతు కూలీ సంఘాలు , రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. నిర్దిష్ట కరువు సహాయక కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలి. నీటి దుర్వినియోగాన్ని అరికట్టి ఎల్నినో ప్రభావం తగ్గేవరకు పరిశ్రమలకు హాలిడే ప్రకటించాలి.వాటికి నీరు, విద్యుత్ నిలిపి వేయాలి. ప్రజలకు అన్ని రకాల నిత్యవసర సరుకులను ఉచితంగా అందించాలి. పంటలు వేయని వారికి, పంటలు వేసి నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం ప్రకటించాలి. పనులు లేక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కూలీలకు ఉపాధి గ్యారంటీతో పాటు వారికి హామీ ఇచ్చిన నెలకు వెయ్యి రూపాయలను రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు లెక్క కట్టి ఆమొత్తాన్ని ఏకకాలంలో ఇవ్వాలి. రైతుల పంటరుణాలు మాఫీ చేయాలి.తిరిగి వారు వ్యవసాయం చేయడానికి తగిన పంటల పెట్టుబడి అందించాలి. పశుగ్రాసం,మంచినీరు కొరత లేకుండా చర్యలు చేపట్టాలి. ఆరుతడి పంటలు వేయడానికి తగిన ప్రోత్సాహకాలు అందించాలి.పట్టణాలలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పట్టణ పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఎల్నినో వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతిని ప్రజలు అనారోగ్యాల బారిన పడిన వారికి ఉచితంగా వైద్యం అందించాలి.ప్రపంచంలో అభివృద్ధి పేర పాలకులు పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్నారు. మన దేశంలో అడ్డు అదుపు లేని కాలుష్యకారక పరిశ్రమలకు అనుమతులిస్తున్నారు. ల్యాండ్ బ్యాంకులను ఏర్పాటు చేసి వేల ఎకరాల వ్యవసాయ భూములను పరిశ్రమలకు అప్పనంగా కేటాయిస్తున్నారు.అటవీ సంరక్షణ చట్టం వచ్చిన తర్వాత దాదాపు 40 లక్షల ఎకరాల అటవీ భూములను మైనింగ్ తదితర అవసరాలకు ఇచ్చారు. ఫార్మా ఇథనాల్ లాంటి తీవ్ర కాలుష్యాన్ని వెదజల్లే అనేక ప్రమాదకర పరిశ్రమలకు విచ్చలవిడిగా అనుమతులిస్తున్నారు. అభివృద్ధి పేరుతో పాలకులు చేస్తున్న విధ్వంసం నేడు అనేక ప్రకృతి విపత్తులకు కారణవుతున్నది. ప్రస్తుత ఎల్నినో కూడా పాలకుల పుణ్యమే. దూర దృష్టి లేకపోతే సమాజం మరిన్ని విపత్తులను ఎదుర్కోవాల్సి ఉంటుంది.ప్రకృతిని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. పాలకుల ప్రకృతి విధ్వంసానికి వ్యతిరేకంగా, పర్యావరణ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన తక్షణ కర్తవ్యం మనముందు వుంది.

సీసీ కెమెరాలు ప్రారంభించిన పోలీస్ కమిషనర్

● ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానం

● సైబర్ నేరాల నియంత్రణ మరియు డ్రగ్స్ నియంత్రణ లో ప్రజలు అప్రమంతముగా ఉండాలి సి. పి



ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడము ఎంతో సంతోషమని , ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమని , సీసీ కెమెరాల ద్వారా గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని , సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని , నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని , పోలీస్ శాఖకు సహకరించాలని కమిషనర్ సూచించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు వారి భద్రత కోసం సి సి కెమెరా లను పెట్టాలని చెప్పారు. ఇది వారి భాద్యత గా తీసుకోవాలి. దుకాణాల యజమానులు తప్పనిసరిగా సి.సి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జక్రాన్ పల్లి గ్రామంలో 54 సి.సి కెమెరాలు పెట్టి సహకరించిన గ్రామ పంచాయతీ ను పోలీస్ కమీషనర్ గారు అభినందించారు. ఈ సందర్భంగా మెండోరా గ్రామశీలో డ్రగ్స్ నివారణ , సైబర్ నేరాల పట్ల అవగాహన , రోడ్డు ప్రమాదాలను నివారణ కోసం అన్నీ రకాల జాగ్రత్త లు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎ.సి.పి వెంకటేశ్వర్ రెడ్డి , ఆర్మూర్ రూరల్ సి.ఐ శ్రీ జాన్ రెడ్డి , మెండోరా ఎస్.ఐ సుహాసిని , మెండోరా గ్రామ వీడిసి చైర్మన్ మోహన్ రెడ్డి , ప్రభాకర్ , సర్పంచ్ ప్రమోద్ , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సామాజిక అవగాహన కల్పించాలి

● గ్లోరియస్ పాఠశాలను సందర్శించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య



ఆర్మూర్,అక్టోబర్,27(పీపుల్స్ డైరీ) : ఆర్మూర్ పట్టణ పరిధిలోని మామిడిపల్లి గ్రామ శివారులో ఉన్న గ్లోరియస్ పాఠశాల తపస్వి సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌ను మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్. సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించి, విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా విధానం, విద్యార్థులకు బోధిస్తున్న పద్ధతులు, వారికి అందిస్తున్న భోజన వసతులు, ఇతర మౌలిక సదుపాయాల గురించి యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, వారి దైనందిన జీవన పరిస్థితులు, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల పాఠశాల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారి ఆరోగ్యం, భద్రత, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యత, మంచి నడవడిక, మానవీయ విలువలు, సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం కూడా ఎంతో అవసరమని తెలిపారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించేలా యాజమాన్యం, ఉపాధ్యాయులు తగిన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాలల పాత్ర కీలకమని, వారికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి , ఆర్మూర్ సీఐ చంద్రశేఖర్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు లో వారాంతపు సంత



కమలాపూర్ అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ): కమలాపూర్ మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలో వారాంతపు సంత ప్రారంభించడం కోసం పాత హై స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయడం కోసం గ్రామపంచాయతీ సిబ్బంది నిర్ణయించి, ఆ ప్రదేశాన్ని వారాంతపు సంత కోసం సిద్ధం చేశారు. ఈ సంత ప్రతి శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుండి పాతబడి ఆవరణలో జరుగుతుంది. రైతులు పండించిన పంటలను నేరుగా దళారులకు సంబంధం లేకుండా వినియోగదారులకు అందించే ఉద్దేశంతో తాజా కూరగాయలను ప్రజలకు అందివ్వడమే ఈ సంత యొక్క ప్రత్యేకత.ఈ సంత నిర్వహణ కోసం సర్పంచ్ వనజ కళాధర్, పాలకవర్గం.ఆధ్వర్యంలో పాతబడి ఆవరణను పూర్తిగా శుభ్రపరచడం జరిగింది. సంతకు వచ్చే రైతులకు, వ్యాపారులకు, ప్రజలకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు ఏర్పాటు చేయబడతాయి .కావున గ్రామ ప్రజలు, రైతులు, వ్యాపారస్తులు, మహిళలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రతి శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుండి జరిగే మన ఊరి సంతను విజయవంతం చేయవలసిందిగా కోరారు.

27 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



భీమదేవరపల్లి, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : భీమదేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు రూ.27,03,132 విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్,ఎంపీడీఓ, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ భీమదేవరపల్లి మండల అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి, సర్పంచులు,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి,హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ కృషితో అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి

టీజీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్.రవీందర్



కోహెడ అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పీఎం శ్రీ టీజీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సిహెచ్ రవీందర్ అన్నారు. మండలంలోని నాగసముద్రాల గ్రామంలోని పీఎం శ్రీ టీజీ మోడల్ స్కూల్ లో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న స్కూల్ బ్యాగులు, షూస్, డైరీలు, డిక్షనరీలను గ్రామ సర్పంచ్ పెరుక సరిత- రామచంద్రంతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాఠశాల విద్య బలోపేతానికి ఉచితంగా టిఫిన్, మధ్యాహ్న భోజనం తోపాటు విద్యార్థులకు అవసరమైన బ్యాగులు, షూస్ వంటి ఉపయోగకరమైన వస్తువులు అందజేయడం ఎంతో సంతోషకరమన్నారు. విద్యార్థులు వినియోగించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం సర్పంచ్ పెరుక సరిత - రామచంద్రం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, సూపర్ ఎల్ నినో ప్రభావం ఉన్నందున నీటిని, విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఏపి చైర్మెన్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం ఉచిత ఆన్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు



ఆళ్ళపల్లి అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు రేగా కాంతారావు పిలుపు మేరకు మండల పరిధిలోని ఆళ్లపల్లి మార్కోడు, గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం ఉచిత ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పినపాక మండల అధ్యక్షులు ఉ ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ ఇన్‌చార్జి పగడాల సతీష్ రెడ్డి , తెలంగాణ ఉద్యమకారులు దిండిగల్ రాజేందర్ ,మాజీ ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి ఆళ్లపల్లి మండల అధ్యక్షులు పాయం నరసింహారావు మాజీ జడ్పీటీసీ కొమరం హనుమంత్ , ప్రధాన కార్యదర్శి షేక్ బాబా , కో-ఆపరేటివ్ చైర్మన్ గొగ్గెల రామయ్య వేమూరి రాంబాబు, తాళ్లపల్లి ఎల్లగౌడ్, కేసరి నరేష్, కంచెర్ల సందీప్, ఈశ్వరోజు అంజయ్య, అంబోజు నవీన్, చామకూరి హరీష్, కేసరి రమేష్, యువ నాయకులు ఎం.డి. అధం, చింటూ, ఖలీద్, తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టు పైనుంచి కింద పడి గీత కార్మికుడు మృతి



ఆళ్ళపల్లి అక్టోబర్ 27(పీపుల్స్ డైరీ) : మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది మంగళవారం నాడు ఉదయం 9 గంటల సమయంలో కోతి యాదగిరి గౌడ్ ప్రతిరోజు లాగానే తాటి చెట్టు ఎక్కి కళ్ళు తీసేందుకు తాటి వనంలోకి వెళ్ళాడు తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మొకు జారడంతో యాదగిరి గౌడ్ తాటి చెట్టు పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు ఈ ఘటనతో మర్కోడు గ్రామంలో ని తీవ్ర విషాదచాయలు అలుముకొని కుటుంబ సభ్యులు బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు

అమ్మనగుర్తి ఘనపూర్ లో భూ భారతి రీ సర్వేపై అవగాహన సమావేశం

రీ సర్వే నియమ నిబంధనలను వివరించిన , ఏడీ కిషన్‌రావు



సైదాపూర్ అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : సైదాపూర్ మండలంఅమ్మన గుర్తి ఘన్ పూర్ గ్రామలలో భూ భారతి రీ సర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులకు అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ కిషన్‌రావు గ్రామ-స్థులకు భూ భారతి రీ సర్వేకు సంబంధించిన వివరాలు, నియమ నిబంధనలు, సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు.భూ భారతి రీ సర్వేకు సంబంధించిన అంశాలను గ్రామస్థులకు వివరించి, సర్వే ప్రక్రియపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచులు కదిరే రమేష్ బాసరాజు రజిత ఉప సర్పంచ్ కార్తీక్ డిప్యూటీ తహ సిల్దార్ . పి లక్ష్మణ్ ఆర్ ఐ మేడవేణి రవీందర్ జిపిఓలు కుమారస్వామి సబిత వార్డు సభ్యులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ములుకనూరులో బుధవారం మెగా ఫిజియోథెరపీ శిబిరం

ములుకనూరు, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ): ములుకనూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో మెగా ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఫిజియోథెరపీ అవసరమైన వారికి వైద్య సేవలు, తగిన సూచనలు అందించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.ములుకనూరు గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి కోరారు.



ఎస్ జిఎఫ్ అండర్-14 వాలీబాల్‌లో కరీంనగర్ జట్టు

ప్రథమ స్థానం స్టేట్ మీట్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



వీణవంక అక్టోబర్ 28(పీపుల్స్ డైరీ) : కేశవపట్నం గ్రామంలో 25-10-2026 రోజున నిర్వహించిన 70వ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్ జి ఎఫ్ అండర్-14 వాలీబాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.ఈ జట్టులో జడ్ పి హెచ్ఎస్ చల్లూరు పాఠశాలకు చెందిన విద్యార్థులు పూదరి మణిదీప్, గోనెల అరవింద్ సాయి ప్రతిభ కనబరిచి స్టేట్ మీట్‌కు ఎంపికయ్యారు. వీరిలో పూదరి మణిదీప్, గోనెల అరవింద్ సాయి మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు కావడం గ్రామస్తులకు గర్వకారణంగా నిలిచింది.ఈ సందర్భంగా చల్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సంపత్ కుమార్ చారి, పీడీ రజిని,చల్లూరు గ్రామ సర్పంచ్ రామిడి సంపత్ రెడ్డి,ఉపసర్పంచ్ ఎండీ ఫసియొద్దీన్ మల్లారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్, ఉపసర్పంచ్ అర్సం శ్రీనివాస్. సీనియర్ క్రీడాకారులు కర్రె నాని, ఉపాధ్యాయులు, గ్రామస్తులు క్రీడాకారులు పూదరి మణిదీప్, గోనెల అరవింద్ సాయిలను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

డిసెంబర్ లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు..?ఆశావాహుల్లో ఉత్సాహం

ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు



చిట్యాల,అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : తెలంగాణ రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. చాలా కాలంగా పెండింగ్లో ఉన్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. రాష్ట్రంలో మొత్తం 5749 ఎంపీటీసీ, 565 జెడ్పీటీసీ తో పాటు జిహెచ్ఎంసి సైబరాబాద్ మల్కాజిగిరి కార్పొరేషన్లలో ఎన్నికల నిర్వహణకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మొదట సర్పంచ్ ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించింది. అదేవిధంగా ఫిబ్రవరి 11న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలను కూడా నిర్వహించింది. అదే కోవలో 2026 డిసెంబర్ చివరి వారంలో లేదా 2027 సంవత్సరంలోని జనవరి నెలలో మండల పరిషత్ జిల్లా పరిషత్ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తు న్నట్లు తెలుస్తుంది. ఎన్నికల ప్రక్రియను నవంబర్ నెలలో మొదలుపెట్టి డిసెంబర్ చివరి వారంలోగా లేదా వచ్చే సంవత్సరం జనవరి మొదటి వారంలో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికలను ఫిబ్రవరిలోనే నిర్వహించే అవకాశం ఉన్న ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు మార్చి 14 నుంచి 10వ తరగతి పరీక్షలు ఉండడంతో వీటిని పూర్తి అయిన తర్వాత మండల జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణకు అనువుగా ఉంటుందని ప్రభుత్వం భావించింది. త్వరలో ఎంపీటీసీ జెడ్పీటీసీ రిజర్వేషన్ల అమలుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తదితర అంశాలపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిన తర్వాత ఇదే స్ఫూర్తి ఉత్సాహంతో ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలు సైతం ఇదే సమయంలో జరిపితే ప్రభుత్వానికి అనుకూలంగా ఫలితాలు ఉంటాయని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ అది అమలు కాలేదు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి బిల్లు కేసు విచారణలో ఉన్నందున చట్టం ప్రకారం అధికారికంగా అమలు కాకపోతే కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు ద్వారా మండల జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ప్రభుత్వం ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలకు పూర్తి స్థాయిలో నిర్వహించుటకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తమ పట్టును మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలను ఒక సువర్ణావకాశంగా కాంగ్రెస్ భావిస్తోంది. ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల అంశం ప్రభుత్వం ముందు ఉన్న అతిపెద్ద సవాలుగా మారింది. గతంలో ప్రవేశపెట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టపరమైన (కోర్టు) సమస్యలు అడ్డంకులు ఎదురవుతున్న నేపథ్యంలో అధికారులు మరో నివేదికను సిద్ధం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం మొదట్లో కులాల (కేస్ట్) సెన్సస్ మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతం మించకూడదు.ఈ న్యాయపరమైన పరిమితిని దృష్టిలో ఉంచుకుని మొత్తం 50 శాతం పరిమితిలోనే బీసీలకు రిజర్వేషన్లు కేటాయించేలా అధికారులు మార్గాలను అన్వేషించారు. దీనికి సంబంధించి ఒక సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. బీసీ రిజర్వేషన్లను 50 శాతం పరిమితికి లోబడి కేటాయించడం వల్ల కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని గతంలో ప్రభుత్వం భావించింది.బీసీల నాయకులతో ప్రజాప్రతినిధులతో మాట్లాడి న్యాయపరమైన చిక్కులు కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఇది కేవలం తాత్కాలికమైన ప్రక్రియ అయితే సుప్రీంకోర్టు తీర్పు వచ్చి బీసీల సంఖ్యను పట్టి వారికీ భవిష్యత్తులో మరింత న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం వివరించడం ద్వారా ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. ప్రస్తుత పరిణామాలు గమనిస్తే మండల జిల్లా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ డిసెంబర్ మొదటి వారంలో లేదా జనవరి మొదటి వారంలో వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ బీఆర్ఎస్ బీజేపీ పార్టీల కొత్త స్థానిక నాయకత్వాన్ని అందించి పార్టీ బేస్ ను మరింత బలోపేతం చేస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే ఎన్నికల తర్వాత కూడా తమ అధికారాన్ని గ్రామస్థాయిలో అమలుకు స్థానిక సంస్థల ద్వారా మరింత వేగం పుంజుకోవచ్చని పార్టీలు అంచనా వేస్తున్నాయి. ఈ పరిషత్ ఎన్నికలు తెలంగాణ రాజకీయాలపై ముఖ్యంగా గ్రామీణ ఓటుబ్యాంకు కాంగ్రెస్ బీఆర్ఎస్ బీజేపీ కమ్యూనిస్టు పార్టీల పట్టును స్పష్టంగా తెలియజేస్తాయి. మొత్తానికి డిసెంబర్ మొదటి వారం లేదా జనవరి మొదటి వారంలో ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందని డిసెంబర్ లేదా జనవరి నెలాఖరులోగా ఎంపీటీసీ జెడ్పీటీసీ తదితర ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

బయ్యారం,జగ్గు తండాలో కోతుల స్వైరవిహారం...

- ఇంటి గడప దాటాలన్నా భయమే...
- చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రత ఏది?...
- కోతుల బెడదపై ప్రజాప్రతినిధులు స్పందించరా? ప్రజల సమస్యకు పరిష్కారం చూపరా?...



మహబూబాబాద్-అక్టోబర్ 27(పీపుల్స్ డైరీ) : బయ్యారం,జగుతండా గ్రామపంచాయతీలలో కోతుల బెడద ప్రజలకు తీవ్ర సమస్యగా మారింది.వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కోతులతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.ఇంటి నుంచి బయటకు రావాలన్నా, పిల్లలను పాఠశాలలకు పంపాలన్నా భయపడాల్సిన దుస్థితి నెలకొంది.ప్రజల నిత్యజీవితాన్ని అస్తవ్యస్తం చేస్తున్న ఈ సమస్యకు పరిష్కారం చూపేవారెవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

వీధుల్లో కోతుల రాజ్యం, ప్రజలకు కంటిమీద కునుకు లేదు!

ఉదయం పాఠశాలలకు వెళ్లే చిన్నారుల నుంచి పనుల మీద బయటకు వెళ్లే మహిళలు, వృద్ధుల వరకు అందరూ కోతుల బెడదతో ఆందోళన చెందుతున్నారు.కోతులు ఎప్పుడు మీద పడతాయో, ఎప్పుడు దాడి చేస్తాయోనని ప్రజలు భయంతో గడుపుతున్నారు. ఇళ్లలోకి చొరబడి కూరగాయలు, ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని చిందరవందర చేస్తూ నష్టం కలిగిస్తున్నాయి. వీధుల్లో స్వేచ్ఛగా తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నా ఈ సమస్యకు ఇప్పటివరకు తగిన పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల భద్రత పట్టదా? స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించరా?

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలపై ఉంది. అలాంటిది ప్రజలు కోతుల బెడదతో భయాందోళనలకు గురవుతుంటే ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.బయ్యారం, జగుతండా గ్రామపంచాయతీ సర్పంచ్ లు ఈ సమస్యను తీవ్రంగా పరిగణించి పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం జరిగిన తర్వాత స్పందిస్తారా?

ప్రజలకు ఇబ్బందులు ఎదు-రవుతున్నప్పుడు ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యవసరం. కోతుల బెడద మరింత తీవ్రమై ఎవరికైనా ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాలి. అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని కోతుల సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలి. ప్రజలు నిర్భయంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలి.

ప్రజల ప్రశ్న ఒక్కటే,కోతుల బెడద నుంచి ఎప్పుడు విముక్తి కల్పిస్తారు?

బయ్యారం, జగుతండా గ్రామ పంచాయతీల సర్పంచులు,సంబంధిత అధికారులు ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి ప్రజల సమస్యపై దృష్టి సారించాలి చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తక్షణమే చర్యలు తీసుకోవాలి. ప్రజల ఇబ్బందులను గుర్తించి సమస్యకు పరిష్కారం చూపినప్పుడే గ్రామ పాలనపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని కోతుల బెడద నుండి కాపాడవలసిన బాధ్యత వారిపై ఉందని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవి నాయక్ కూడా విజ్ఞప్తి చేశారు.

ఎల్‌నినో నేపథ్యంలో ఆరుతడి పంటలనే సాగు చేయాలి

- ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ఖరీఫ్ పంటను గట్టెక్కిస్తాం...రబీలో మాత్రం వరి వేస్తే కాపాడలేం
- ఆరుతడి సాగుకు అన్నివిధాలుగా తోడ్పాటును అందిస్తాం
- కొత్తగా బోరుబావులు తవ్వితే సీజ్ చేస్తామని స్పష్టీకరణ



నిజామాబాద్.అక్టోబర్ 27(పీపుల్స్ డైరీ) : ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రైతులు రబీలో ఆరుతడి పంటలనే సాగు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా తదితర పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఒకవేళ వరి మినహా ఇతర పంటల సాగుకు చౌడు భూములు వంటి నేల రకాలు సహకరించకపోతే క్రాప్ హాలిడే పాటించాలని, వరి సాగు మాత్రం చేయవద్దని స్పష్టం చేశారు. నందిపేట మండలం నూత్ పల్లి రైతు వేదికలో మంగళవారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. ఖరీఫ్ లో వేసిన వరి పంట పూర్తి స్థాయిలో చేతికి అందేంత వరకు జిల్లా యంత్రాంగం తరపున కాపాడుతామని రైతులకు భరోసా కల్పించారు. అయితే రబీలో మాత్రం వరి పంటకు సాగు నీరు అందించే పరిస్థితి ఉండదని కలెక్టర్ వెల్లడించారు. సూపర్ ఎల్ నినో ప్రభావంతో ప్రతీకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రైతులకు కీలక సూచనలు చేశారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పెసలు, మినుములు, శనగతో పాటు జొన్న, మొక్కజొన్న, కూరగాయలు వంటి పంటల సాగును చేపట్టడం ఎంతో శ్రేయస్కరమని రైతులను ప్రోత్సహించారు. బిందు సేద్యాన్ని వినియోగించుకొని ఆయిల్‌పామ్ తోటలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేయడం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవచ్చని అన్నారు. ఆరుతడి పంటల సాగుకు ముందుకు వచ్చే రైతాంగానికి ప్రభుత్వ పరంగా జిల్లా యంత్రాంగం తరపున తోడ్పాటును అందిస్తామని భరోసా కల్పించారు. మల్చింగ్, బిందు సేద్యం విధానాలకు రాయితీ వర్తించేలా ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు. కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే దిశగా కూడా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వీబీజీరాంజీ కింద ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరు బావుల రీఛార్జ్ వంటి పనులను చేపట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించుకోవడంపై దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అయితే ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కొత్తగా బోరుబావులు తవ్వకూడదని, ఎవరైనా తవ్వితే వాటిని సీజ్ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రస్తుతం ప్రధాన జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటినిల్వలను తాగునీటి అవసరాలకే విని యోగిస్తామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయని, రానున్న రోజుల్లో సేద్యానికి కరెంటు సరఫరాకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని, యాసంగిలో వరి సాగు చేసి ఇబ్బందుల్లో పడవద్దని జిల్లా పాలనాధికారి హితవు పలికారు. ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక మహిళా సంఘాల ప్రతినిధులు సైతం రబీలో రైతులు ఆరుతడి పంటలే సాగు చేసేలా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తూ వారికి అవగాహన కల్పించాలని అన్నారు.

ఈ సందర్భంగా ఆదర్శ రైతులు తమ అభిప్రా యాలను వెల్లడించగా, రబీలో ఏ తరహా పంటలు సాగు చేయవచ్చు, కరువు పరిస్థితులను అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలు ఏమిటీ తదితర అంశాలపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రావు, ఉద్యానవన శాఖ అధికారిణి సంధ్య, సర్పంచ్ రాజిరెడ్డి, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
బుధవారం, 28 అక్టోబర్ 2026
సంపుటి : 18, సంచిక : 219

కోతులతో పరేషాన్.. ఇళ్లలోకి చొరబడుతూ ఇబ్బందులు

భయాందోళనలో ప్రజలు



రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని గ్రామాల్లో వానరాలు రోజురోజుకు వీరంగం సృష్టిస్తున్నాయి. కోతులు గుంపులుగా వెళుతూ కాలనీలపై విరుచుకుపడుతున్నాయి. ఇళ్లు, దుకాణాలలో తినుబండారాలు, వస్తువులను ఎత్తుకెళ్లడంతో పాటు పండ్ల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలపై దాడులకు దిగుతూ గాయపరుస్తున్నాయి. కోతుల భయంతో ప్రజలు అందోళన చెందుతున్నారు. కోతుల నియంత్రణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోతులు గుంపులు గుంపులుగా ఇళ్ల వద్ద సంచరిస్తూ వీరంగం సృష్టిస్తున్నాయి. అటవీ ప్రాంతాలు రోజురోజుకు తగ్గిపోవడం వాటికి అడవిలో ఆహారం లభించకపోవడంతో గ్రామాల్లోకి, కాలనీల్లోకి చొచ్చుకువస్తున్నాయి. ఇళ్లలో తయారు చేసుకున్న భోజనాలతో పాటు పప్పు దినుసులు పట్టుకెళ్తున్నాయి. కిరాణాషా పులు, పండ్ల దుకాణాలదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపుల్లోని వస్తువులకు రక్షణగా జాలీలను ఏర్పాటుచేసు కుంటున్నారు.ఇళ్లలో చొరబడి వీరంగం సృష్టిస్తున్న కోతులను తరిమే ప్రయత్నంలో అవి ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. కోతి కాటుకు గురై ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇళ్లపై గుంపులుగుంపులుగా ఒక చోట చేరి వచ్చిపోయే వారిపై ఎగబడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతుల బెడద తీవ్రం కావడంతో కొంత మంది టపాసులు, పెద్ద శబ్దాలు చేసి కోతులను తరిమే ప్రయత్నం చేస్తున్నారు. కోతుల నియంత్రణ కోసం అధికారులు చర్యలు చేపట్టి వాటిని అటవీ ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

కోతులు ఇళ్లలోకి గుంపుగుంపులుగా వచ్చి ఆహరప దార్థాలు ఎత్తుకెళ్తు న్నాయి. వాటిని తరిమేక్రమంలో దాడులు చేస్తున్నాయి. కోతుల బెడద రోజురోజుకు ఎక్కువవుతోంది. వాటి నుంచి తప్పించుకునే క్రమంలో దెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోతుల బెడద నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి.

ప్రతి ఒక్కరూ పోలీస్ ఇమేజ్ పెంచే విధంగా కృషి చేయాలి

- **మెండోరా పోలీస్ స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్**
- **పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదుతో మర్యాదగా ప్రవర్తించాలి**



ఆర్మూర్,మెండోర, అక్టోబర్, 27 (పీపుల్స్ డైరీ) : ఆర్మూర్ సబ్ డివిజన్ లోని మెండోరా పోలీస్ స్టేషన్‌ను మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. మంగళవారం క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి అనంతరం సిబ్బందికి సంబంధించినటువంటి కిట్ ఆర్టికల్ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తదుపరి పోలీస్ స్టేషన్లో పూర్తిగా కలియతిరిగారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని కేసుల నమోదు , దర్యాప్తు పురోగతి , పెండింగ్ కేసులు , ఫిర్యాదుల పరిష్కారం , స్టేషన్ రికార్డుల నిర్వహణ , సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను కమిషనర్ గారు సమగ్రంగా పరిశీలించారు.మహిళలు , బాలికలకు సంబంధించిన ఫిర్యాదులపై పోలీసులు త్వరితగతిన స్పందించి, బాధితులకు భరోసా కల్పిస్తూ , చట్టపరమైన నిబంధనల ప్రకారం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా బాధితులు తమ సమస్యలను ఎటువంటి భయాందోళనలు లేకుండా పోలీసులకు తెలియజేసే విధంగా వారికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని ఆదేశించారు.అదేవిధంగా మహిళలు , బాలికలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తును నిర్లక్ష్యం చేయకుండా , ప్రతి కేసును సున్నితమైన అంశంగా పరిగణిస్తూ , అవసరమైన ఆధారాలను సేకరించి , దర్యాప్తును నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు , బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లోని వివిధ రికార్డులు , కేసు ఫైళ్లు , పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి , దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు.మెండోరా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో మర్యాదగా , గౌరవంగా వ్యవహరిస్తూ , వారి సమస్యలను ఓర్పుతో విని , చట్టపరమైన పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా మహిళలు , బాలికల భద్రతకు సంబంధించిన అంశాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజలకు ముఖ్యంగా మహిళలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది 24శ7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని , అదే విధంగా ముందస్తుగా రాబోయే రోజుల్లో పుష్కరాలు దృష్టిలో ఉంచుకొని సిబ్బంది అందరూ ప్రిపేర్ అయి ఉండాలని , దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని , సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని , ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర రెడ్డి, సి.సి.ఆర్.బి .ఎ.సి.పి గురు నాయుడు , ఆర్మూర్ రూరల్ ఇన్స్పెక్టర్ జాన్రెడ్డి, మెండోరా, ఎస్ ఐ జె.సుహాసిని, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సేవా భావమే విజయ్‌కుమార్ జీవిత లక్ష్యం

మాజీ మున్సిపల్ చైర్మన్ సేవలు ఆదర్శప్రాయం

- **ఘనంగా జన్మదిన వేడుకలు.. ప్రజాకవి డాక్టర్ నాగుల సత్యంగౌడ్ ప్రశంసలు**



హుజూరాబాద్, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : ప్రజాసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకుని, ఆపదలో ఉన్న పేదలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్న హుజూరాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్ సేవలు అభినందనీయమని మానవ విలువల పరిరక్షణ జాతీయ అధ్యక్షులు, ప్రజాకవి, తత్వవేత్త బ్రహ్మశ్రీ డాక్టర్ నాగుల సత్యంగౌడ్ కొనియాడారు. విజయ్‌కుమార్ అందించిన నిస్వార్థ సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని అవంతి కన్వెన్షన్ హాలులో మంగళవారం వడ్లూరి విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగుల సత్యంగౌడ్ ఆయనకు పట్టు శాలువా కప్పి, ఆధ్యాత్మిక కవితా జ్ఞాపికతో పాటు పూలబొకే అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ నాగుల సత్యంగౌడ్ మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, ఆపదలో ఉన్న పేదలకు తనకు చేతనైన సహాయం అందించడం విజయ్‌కుమార్‌లోని సేవా నిరతికి నిదర్శన మని అన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేసే నాయకులు సమాజంలో చిరస్థాయిగా గుర్తింపు పొందుతారని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్‌గా విజయ్‌కుమార్ తన పదవీకాలంలో హుజూరాబాద్ పట్టణ అభివృద్ధికి కృషి చేసి, వివిధ రంగాల్లో పట్టణానికి గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని సత్యంగౌడ్ అన్నారు. ప్రజాప్రతినిధులు పదవులకే పరిమితం కాకుండా, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను గుర్తించి, పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. స్వార్థాన్ని వీడి, మానవతా దృక్పథంతో ఇతరులకు సహాయపడుతూ మానవ జన్మను సార్థకం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ జన్మదిన వేడుకల్లో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రుద్రారపు రామచంద్రం, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఇమ్రాన్, బండ నవీన్, బొడ్డు సంజయ్, తునికి వసంత్, నందగిరి శ్రీనివాస్, బాబురావు, వెంకటస్వామి, శాయిల రాజు, జడల సమ్మయ్య, చందు, ముకుందరెడ్డి, రాజుగౌడ్, బాలాజీ తదితరులు పాల్గొని విజయ్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల సేవలు మరువలేనివి

- **పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం**
- **ఏసీపీ మాధవి, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని**



హుజూరాబాద్, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ): ప్రజల రక్షణే లక్ష్యంగా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని హుజూరాబాద్ ఏసీపీ మాధవి, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని కొనియాడారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు చేసిన బలిదానాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని హుజూరాబాద్ సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని హుజూరాబాద్ క్లబ్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో రక్తసేకరణ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు పట్టణానికి చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు.

అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుంది

ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల సేవలను సమాజం ఎప్పటికీ మరచిపోదన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, మరొకరి ప్రాణాలను కాపాడే రక్తదానం వంటి సేవా కార్యక్రమాల ద్వారా వారికి నిజమైన నివాళులర్పించవచ్చని పేర్కొన్నారు. సమాజ హితం కోసం నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానిక యువత పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. రక్తదానం పట్ల యువతలో మరింత అవగాహన పెంపొందించాలని సూచించారు.

ప్రజల ప్రశాంత జీవనానికి పోలీసుల కృషి కీలకం

మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ సమాజంలో ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయని పేర్కొన్నారు.అమరవీరుల కుటుంబాల సంక్షేమం పట్ల ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అభిప్రాయపడ్డారు. రక్తదానం వంటి మానవతా కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తాయని, ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అధికారులు, యువత ఉత్సాహభరిత భాగస్వామ్యం

ఈ రక్తదాన శిబిరంలో హుజూరాబాద్ టౌన్ సీఐ టీ. కర్ణాకర్, రూరల్ సీఐ బొల్లబత్తిని శ్రీనివాస్, రామకృష్ణ గౌడ్, పులి వెంకట్ గౌడ్, ఎస్ఐలు కొత్తపల్లి రవి, కృష్ణారావు, కట్కూరి శ్రీకాంత్ రెడ్డి, ప్రసాద్ రావు, ఐసీటీసీ కౌన్సిలర్ సుజాత, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం సేవాభావానికి, సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలిచింది.

అర్హులైన దివ్యాంగుల పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించాలి



సైదాపూర్ అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ): ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన దివ్యాంగుల పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని సైదాపూర్ మండల వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు జక్కోజు బిక్షపతి మండల ఎం.ఎస్.పి అధ్యక్షులు అధికారులను ప్రభుత్వాన్ని కోరారు. ఇళ్ల మంజూరు ప్రక్రియలో మహిళా శిశు సంక్షేమ వయోవృద్ధుల దివ్యాంగుల శాఖ దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి కేటాయింపులు ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించాలని పారదర్శకత పాటిస్తూ, అర్హులైన లబ్ధిదారులను నిబంధనల ప్రకారం ఎంపిక చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. గ్రామాల్లో ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న దివ్యాంగుల పేదలకు పథకం ద్వారా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అర్హతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించాలని కోరారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక సొంత ఇళ్లు నిర్మించుకోలేని పేద కుటుంబాలు గ్రామాల్లో అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలను గుర్తించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, పేదల సొంతింటి కలను సాకారం చేయాలని జక్కోజు బిక్షపతి ఎల్కపల్లి పౌల్ కోరారు.

గన్ముక్కుల గ్రామంలో డ్రగ్స్, గంజాయి కోసం పోలీసుల తనిఖీలు

డాగ్ స్క్వాడ్‌తో సోదాలు లభించని మాదకద్రవ్యాలు



వీణవంక అక్టోబర్ 28(పీపుల్స్ డైరీ) : మండల కేంద్రంతో పాటు గన్ముకుల గ్రామంలో వీణవంక పోలీసు సిబ్బంది డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. పలు షాపుల్లో డ్రగ్స్, గంజాయి ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రంలోని పలు షాపులతో పాటు గన్ముకుల గ్రామంలోనూ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో అనుమానాస్పద ప్రాంతాలను పరిశీలించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలను అరికట్టడంలో భాగంగా పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో ఎలాంటి గంజాయి, డ్రగ్స్ లభించలేదు. ఎలాంటి మాదకద్రవ్యాలు గుర్తించకపోవడంతో తనిఖీలు ప్రశాంతంగా ముగిశాయి. మాదకద్రవ్యాల నిర్మూలనకు, ప్రజల భద్రతకు పోలీసులు చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రజలు మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలను గమనిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ముత్యం కుమార్



భీమదేవరపల్లి, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ): ఉమ్మడి వరంగల్ జిల్లా ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ముత్యం కుమార్ నూతన బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ముత్యం కుమార్ మాట్లాడుతూ తనకు ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు గాదె లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి అను సత్యం, కోశాధికారి జగదీష్, దయాకర్, రెడీస్ తిరుపతితో పాటు అసోసియేషన్ నాయకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఫోటో, వీడియోగ్రఫీ రంగానికి చెందిన వారి సంక్షేమం, ఐక్యత, అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ముత్యం కుమార్ పేర్కొన్నారు. సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు అందరి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.

పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన

గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై న్యాయమూర్తుల సూచనలు

జగిత్యాల, అక్టోబరు,27: జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం పోక్సో చట్టం--2012పై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణకు పోక్సో చట్టంలో పొందుపరిచిన ముఖ్య నిబంధనలు, బాధిత బాలలకు అందించే చట్టపరమైన రక్షణ, బాలల హక్కులు, భద్రత ప్రాముఖ్యతను వివరించారు.రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి నిక్షిష విద్యార్థినులకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. తమను తాము, ఇతర బాలలను రక్షించుకోవడం, వ్యక్తిగత హద్దులను గౌరవించడం, వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవడం, అసురక్షిత పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే పెద్దలకు తెలియజేయడం వంటి అంశాలపై విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
బుధవారం, 28 అక్టోబర్ 2026
సంపుటి : 18, సంచిక : 219

ఎల్నీనో ప్రభావంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

రైతులకు ఏడీఏ సునీత సూచన




హుజురాబాద్, అక్టోబర్ 27 (పీపుల్స్ డైలీ): ఎల్నీనో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో రాబోయే యాసంగి సీజన్‌లో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని హుజురాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు (ఏడీఏ) జి. సునీత సూచించారు. భూసారాన్ని పరిరక్షిస్తూ, భావితరాలకు ఆరోగ్యకరమైన నేలలను అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె స్పష్టం చేశారు. రైతులు రసాయన ఎరువులపై అధికంగా ఆధారపడకుండా సమతుల్య ఎరువుల వినియోగాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. హుజురాబాద్‌లోని రైతు వేదికలో మంగళవారం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌తో పాటు వ్యవసాయ శాఖ, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో 'కేప్ బచావో అభియాన్'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో ఎదురవుతున్న సవాళ్లు, భూసార పరిరక్షణ, నీటి పొదుపు, పంటల ఎంపిక, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏడీఏ జి. సునీత మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా దీర్ఘకాలంలో వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవచ్చని తెలిపారు. రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులు, ఇతర వ్యవసాయ రసాయనాలను వినియోగించకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. సాగునీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు సుస్థిర పోషక యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. భూసారాన్ని కాపాడుకుంటూ వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవడానికి సమగ్ర యాజమాన్య పద్ధతులు దోహదపడతాయని పేర్కొన్నారు.

యాసంగి పంటల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి : జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రశాంతి మాట్లాడుతూ ప్రస్తుత ఎల్నీనో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాబోయే యాసంగి సీజన్‌లో రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులు, నేల స్వభావాన్ని బట్టి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. పంట కాలవ్యవధి, విత్తే సమయం, శాస్త్రీయ ఎరువుల యాజమాన్యం వంటి అంశాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని కోరారు. సరైన పంట ప్రణాళికతో సాగు చేపడితే నీటి వినియోగాన్ని నియంత్రించడంతో పాటు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా అనవసర నష్టాలను నివారించుకుని మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

భారీ పెట్టుబడులతో నష్టపోవద్దు : హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సువాసిని మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ఎల్నీనో ప్రభావం నేపథ్యంలో రైతులు సాగు ప్రణాళికపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పరిస్థితులను అంచనా వేయకుండా భారీగా పెట్టుబడులు పెట్టి నష్టాలపాలుకావద్దని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల మార్గదర్శకాలకు అనుగుణంగా పంటల ఎంపిక, నీటి వినియోగం, ఎరువుల నిర్వహణపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక శాస్త్రీయ సాగు విధానాలను అవలంబిస్తూ అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సెరికల్చర్ ఏడీ వెంకన్న, వ్యవసాయాధికారి భూమిరెడ్డి, కౌన్సిలర్లు బురగల్ల సమ్మయ్య, సోల్ల సునీత, సహకార శాఖ అధికారులు, ఏఈఓలు, పీఏసీఎస్ సీఈఓలు, ఎఫ్‌పీఓ ప్రతినిధులు, హుజురాబాద్ నియోజకవర్గానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీళ్లు లేక ఎండుతున్న వరి పంట



భీమదేవరపల్లి, అక్టోబర్ 27 (పీపుల్స్ డైలీ): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో సాగునీటి సౌకర్యం లేక వరి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంతో కష్టపడి సాగు చేసిన వరి పంట కీలక దశకు చేరుకున్న సమయంలో నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడం, ప్రాజెక్టుల నుంచి సాగునీరు అందకపోవడంతో పెట్టిన పెట్టుబడులు వృథా అయ్యే పరిస్థితి నెలకొందని తెలిపారు. గ్రామానికి చెందిన రైతు గుండెల్లి సదానందం తనకున్న రెండు ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట ఏపుగా పెరిగి ఈనె దశకు చేరుకున్న సమయంలో సాగునీరు అందక పొలం ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంటకు అత్యంత కీలకమైన సమయంలో నీరు అందకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని తెలిపారు.

గ్రామ శివారు నుంచే ప్రాజెక్టు నీళ్లు.. పొలాలకు మాత్రం అందని వైనం

గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి సాగునీరు అందకపోవడంతో పాటు, దేవాదుల ప్రాజెక్టు నీరు గ్రామ శివారు పక్క నుంచే వెళ్తున్నప్పటికీ రత్నగిరి రైతుల పొలాలకు మాత్రం నీరు అందడం లేదని సదానందం పేర్కొన్నారు. ప్రాజెక్టుల నీటిని సమర్థవంతంగా వినియోగించి గ్రామ రైతులకు సాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

25 ఏళ్లుగా ఇదే సమస్య : గత 25 సంవత్సరాలుగా రత్నగిరి గ్రామ రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని సదానందం తెలిపారు. వర్షాలు కురిస్తేనే వరి నాట్లు వేసుకునే పరిస్థితి ఉందని, వర్షాలు అనుకూలిస్తే పంట చేతికి వస్తుందని, లేకపోతే తీవ్ర నష్టాలు తప్పడం లేదన్నారు. ఆధునిక సాగునీటి వసతులు అందుబాటులోకి వచ్చినా తమ గ్రామ రైతులు ఇప్పటికీ వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.పంటల సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్న రైతులకు కీలక సమయంలో నీరు అందకపోతే ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి : రత్నగిరి గ్రామ రైతుల సాగునీటి సమస్యపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గుండెల్లి సదానందం విజ్ఞప్తి చేశారు. గౌరవెల్లి, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా గ్రామానికి సాగునీరు అందించే అవకాశాలను పరిశీలించి, అవసరమైన కాలువలు, నీటి పంపిణీ వ్యవస్థలు, విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించాలని కోరారు. రైతు పంటకు నీరందించడం దయ కాదు.. వారి శ్రమకు, పెట్టుబడికి భరోసా కల్పించడం. రత్నగిరి రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు సాగునీటి భరోసా కల్పించాలని సదానందం కోరారు.

హుజూరాబాద్ మున్సిపాలిటీ ఖర్చులపై సమగ్ర విచారణ జరపాలి

- **టెండర్లు, పండుగల నిర్వహణ వ్యయాలపై ప్రజలకు లెక్కలు చెప్పాలి**
- **తెలంగాణ రక్షణ సేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కూకట్ల సంతోష్ కుమార్ యాదవ్ డిమాండ్**



హుజూరాబాద్, అక్టోబర్ 27 (పీపుల్స్ డైలీ) : హుజూరాబాద్ మున్సిపాలిటీలో ప్రజాధనం ఖర్చు, టెండర్ల నిర్వహణ, పండుగల వ్యయాలు, కాంట్రాక్టు పనులపై వస్తున్న అనుమానాలను నివృత్తి చేసేందుకు సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కూకట్ల సంతోష్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే ప్రతి రూపాయికి అధికారులు, పాలకవర్గం జవాబుదారీగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. హుజూరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, సద్దుల బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణ, రావణాసురుడి విగ్రహం ఏర్పాటు, వినాయక నిమజ్జనం పనులు, వివిధ టెండర్లు, మున్సిపల్ వాహనాల వినియోగం తదితర అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పండుగల నిర్వహణకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రజాధనంతో చేపట్టే ప్రతి కార్యక్రమానికి సంబంధించిన ఖర్చుల వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని కోరారు.

రావణాసురుడి విగ్రహం ఎత్తుపై స్పష్టత ఇవ్వాలి

మున్సిపాలిటీలో రావణాసురుడి విగ్రహాన్ని 40 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం ఉందని, అయితే వాస్తవంగా ఏర్పాటు చేసిన విగ్రహం ఎత్తుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయని సంతోష్ కుమార్ యాదవ్ తెలిపారు. ఒప్పందంలో పేర్కొన్న కొలతలు, వాస్తవంగా ఏర్పాటు చేసిన విగ్రహం ఎత్తును అధికారులు పరిశీలించి వెల్లడించాలని కోరారు. సంబంధిత వర్క్ ఆర్డర్లు, కొలతల రికార్డులు, బిల్లులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

టెండర్ల కేటాయింపులపై విచారణ జరపాలి

మున్సిపాలిటీలో ఒకే కాంట్రాక్టర్‌కు పదేపదే పనులు దక్కుతున్నాయా? టెండర్ల నిర్వహణలో నిబంధనలు పాటిస్తున్నారా? ఇతర కాంట్రాక్టర్లకు సమాన అవకాశాలు కల్పిస్తున్నారా? అనే అంశాలపై ఉన్నతాధికారులు పరిశీలన జరపాలని కోరారు. పనుల అంచనా వ్యయం, ఒప్పంద ధరలు, వాస్తవ ఖర్చుల వివరాలను వెల్లడించాలని సూచించారు. వినాయక నిమజ్జనం పనులకు సంబంధించి ఒక్కో పని విలువ రూ.99 వేల చొప్పున తొమ్మిది పనులు కేటాయించినట్లు తనకు సమాచారం ఉందని పేర్కొంటూ, వాటికి సంబంధించిన టెండర్ నోటీసులు, బిడ్డర్ల వివరాలు, అగ్రిమెంట్లు, వర్క్ ఆర్డర్లు, బిల్లులను పరిశీలించాలని కోరారు. పనులను విడగొట్టి కేటాయించడం నిబంధనలకు అనుగుణంగా జరిగిందా లేదా అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలన్నారు.

మున్సిపల్ వాహనాల వినియోగంపై వివరాలు వెల్లడించాలి

కాంట్రాక్టు పనులకు మున్సిపాలిటీకి చెందిన జేసీబీలు, డోజర్లు, ఇతర వాహనాలు, సిబ్బందిని వినియోగించినట్లయితే వాటి వివరాలు వెల్లడించాలని సంతోష్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. వాహనాల లాగ్‌బుక్స్, డీజిల్ ఖర్చులు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించాలని కోరారు. కాంట్రాక్టు బిల్లుల్లో యంత్రాల ఖర్చులు చేర్చిన సందర్భాల్లో మున్సిపల్ వాహనాలు కూడా ఉపయోగించారా అనే అంశాన్ని విచారించాలని సూచించారు.

పండుగల ఖర్చులపై పారదర్శకత అవసరం

సద్దుల బతుకమ్మ, దసరా వేడుకల సందర్భంగా లైటింగ్, జనరేటర్లు, బాణసంచా, విగ్రహాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, గ్రీన్ కార్పెట్, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లకు చేసిన ఖర్చుల వివరాలను వెల్లడించాలని ఆయన కోరారు. ప్రతి పనికి ఎంత అంచనా వేశారు? ఎంత మొత్తానికి ఒప్పందం కుదిరింది? వాస్తవంగా ఎంత ఖర్చు చేశారు? బిల్లులను ఎవరు ఆమోదించారు? అనే వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. బ్లీచింగ్ పౌడర్ కొనుగోళ్లు, పారిశుద్ధ్య పనులు, కార్యాలయ నిర్వహణ వంటి ఇతర వ్యయాలకు సంబంధించిన బిల్లులు, కొటేషన్లు, టెండర్లు, చెల్లింపుల వివరాలను కూడా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు స్పందించాలి

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్ నాయకత్వంలో మున్సిపల్ పాలన కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ అంశాలపై ఆమె స్పష్టమైన సమాధానం చెప్పాలని సంతోష్ కుమార్ యాదవ్ కోరారు. బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు కూడా ప్రజాధనానికి సంబంధించిన అంశాలపై తమ వైఖరిని వెల్లడించాలని అన్నారు. ప్రజాధనం ఖర్చుపై ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత అని పేర్కొన్నారు.హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ కూడా మున్సిపాలిటీలో టెండర్లు, కాంట్రాక్టులు, ఖర్చులపై ప్రజల్లో వ్యక్తమవుతున్న ప్రశ్నలకు స్పందించాలని కోరారు. ఈ అంశాలను రాజకీయ కోణంలో కాకుండా ప్రజాధనం, పారదర్శక పాలనకు సంబంధించిన విషయాలుగా చూడాలని సూచించారు.

ఆరు ప్రధాన డిమాండ్లు

రావణాసురుడి విగ్రహం ఎత్తు, ఒప్పందం, బిల్లులపై విచారణ జరపాలని, పండుగలు, వినాయక నిమజ్జనం పనులకు సంబంధించిన టెండర్లు, అగ్రిమెంట్లు, వర్క్ ఆర్డర్లు, బిల్లులను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టెండర్ల కేటాయింపుల్లో నిబంధనలు పాటించారా లేదా పరిశీలించాలని, కాంట్రాక్టు పనులకు మున్సిపల్ వాహనాలు, సిబ్బందిని వినియోగించినట్లయితే పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. మున్సిపాలిటీలో జరిగిన ప్రధాన ఖర్చులపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించి, నిబంధనల ఉల్లంఘన లేదా ప్రజాధనానికి నష్టం జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రజాధనాన్ని కాపాడటం, పాలనలో పారదర్శకత సాధించడం తమ లక్ష్యమని పేర్కొన్న సంతోష్ కుమార్ యాదవ్, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణకు ఆదేశించాలని కోరారు. విచారణ నివేదికను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నియోజకవర్గ మహిళా నాయకురాలు పొన్నం శిరీష, నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు బండ అశోక్, దిటీ రమేష్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రిలో దయనీయ పరిస్థితులు!

- **రోగులకు కనీస వైద్య సదుపాయాలు కరువు**
- **వైద్యుల కొరత, ప్రైవేట్ ఆసుపత్రులకు రోగుల మళ్లింపుపై సీపీఐ సీనియర్ నాయకుడు మర్రి వెంకటస్వామి ఆగ్రహం**

హుజూరాబాద్, అక్టోబర్ 27 (పీపుల్స్ డైలీ) : హుజూరాబాద్‌లోని వంద పడకల ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో పాలన అస్తవ్యస్తంగా మారిందని, రోగులకు కనీస వైద్య సదుపాయాలు సైతం అందడం లేదని సీపీఐ సీనియర్ నాయకుడు, న్యాయవాది మర్రి వెంకటస్వామి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మంగళవారం ఆసుపత్రిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

రికార్డుల్లో 18 మంది వైద్యులు.. విధులకు హాజరయ్యేది ఏడుగురే!

ఆసుపత్రిలో వైద్యుల హాజరు, వైద్య సేవల నిర్వహణపై ఆయన పలు ఆరోపణలు చేశారు. నిబంధనల ప్రకారం 37 మంది వైద్యులు ఉండాల్సిన చోట రికార్డుల్లో 18 మంది మాత్రమే ఉన్నారని, వారిలోనూ విధులకు కేవలం ఏడుగురే హాజరవుతున్నారని ఆరోపించారు. వైద్యుల కొరత కారణంగా ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వైద్యుల హాజరు వివరాలను ఉన్నతాధికారులు పరిశీలించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

గైనకాలజీ విభాగంలోనూ సమస్యలు

గైనకాలజీ విభాగంలో స్పెషలిస్టు వైద్యులకు బదులుగా ఇతర వైద్యులతో ఓపీ సేవలు నిర్వహిస్తున్నారని వెంకటస్వామి ఆరోపించారు. మహిళలకు అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశంపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే రోగులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

తాగునీరు కూడా కొనుక్కోవాల్సిన దుస్థితి

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మౌలిక వసతులు సరిగా లేవని ఆయన విమర్శించారు. కనీసం తాగునీటి సదుపాయం లేకపోవడంతో రోగులు, వారి సహాయకులు బయట కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం అందించడం ఆసుపత్రి యాజమాన్యం బాధ్యత అని గుర్తుచేశారు.

ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలకు రోగుల మళ్లింపు?

ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవడానికి వచ్చే రోగులను కొందరు ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలు, ప్రైవేట్ ఆసుపత్రులకు మళ్లిస్తున్నారని మర్రి వెంకటస్వామి ఆరోపించారు. ఈ వ్యవహారంలో కమిషన్లకు ఆశపడి రోగుల ప్రయోజనాలను విస్మరిస్తున్నారనే అనుమానాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండాల్సిన వైద్య పరీక్షలు, ఇతర సేవల వివరాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.



సూపరింటెండెంట్‌పై విచారణ జరపాలి

విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌తో పాటు సంబంధిత సిబ్బందిపై సమగ్ర విచారణ జరిపి, తప్పులు నిర్ధారణ అయితే తగిన చర్యలు తీసుకోవాలని వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో వైద్యుల హాజరు, రోగులకు అందుతున్న సేవలు, మౌలిక వసతులు, వైద్య పరీక్షల నిర్వహణపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి

స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని వెంటనే ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి అవసరమైన వైద్య సేవలు, మందులు, పరీక్షలు, తాగునీరు, నాణ్యమైన ఆహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు.

కోర్టు భవనాలు, భూ అప్పగింత, పెండింగ్ కేసులపై చర్చ

న్యాయ, పరిపాలనా అంశాలపై సమీక్ష

జగిత్యాల, అక్టోబరు,27:) జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. రత్న పద్మావతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో పలు న్యాయ, పరిపాలనా అంశాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, వివిధ న్యాయస్థానాల న్యాయమూర్తులు పాల్గొన్నారు. జగిత్యాలలో 10o2 కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన భూమిని న్యాయశాఖకు అప్పగించే అంశంపై చర్చించారు. భూసేకరణ పరిహారానికి సంబంధించిన ఎల్ఏఓపీ కేసుల ఎగ్జిక్యూషన్ పిటిషన్ల పరిష్కారం, పరిహార సొమ్ము జమ, పెండింగ్ అంశాలపై సమీక్షించారు. జిల్లాకు కొత్తగా మంజూరైన మూడు న్యాయస్థానాలకు భవనాల కేటాయింపు, అవసరమైన వసతుల కల్పనపై చర్చించారు. సీఆర్‌పీసీ సెక్షన్లు 82, 83 కింద చేపట్టిన ప్రక్రియకు సంబంధించి పది కేసుల నివేదికలను పరిశీలించారు. సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల నుంచి నివేదికల సమర్పణ, పోలీసు, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయంపై సమీక్షించారు. న్యాయస్థానాల నుంచి పంపిన అధికారిక లేఖలకు స్పందన, పెండింగ్ ఉత్తర ప్రత్యుత్తరాలు, నివేదికల సమర్పణలో జాప్యాన్ని తగ్గించి పరిపాలనా సమస్యలను సమన్వయంతో పరిష్కరించడంపై సమావేశంలో చర్చించారు





మహిళా కండక్టర్‌పై దాడిని ఖండిస్తూ కార్మికుల ధర్నా

ప్రవళికకు మెరుగైన వైద్యం అందించాలి-పూర్తిస్థాయి జీతంతో ఐఓడీ కల్పించాలి

నర్సంపేట, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (తెలంగాణ ఆర్టీసీ) మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళికపై ప్రయాణికురాలు జరిపిన దాడిని నిరసిస్తూ నర్సంపేట డిపో కార్మికులు డిపో ఎదుట ధర్నా నిర్వహించి, ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కార్మికులు పలు డిమాండ్లను అధికారుల ముందు ఉంచారు. దాడిలో గాయపడిన ప్రవళికకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని, ఆమె పూర్తిగా కోలుకునేంత వరకు ఐఓడీ మంజూరు చేసి పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఆమెపై దాడికి పాల్పడిన ప్రయాణికురాలికి కఠిన శిక్ష విధించాలని, ప్రభుత్వం తరఫున రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట డిపో ఉద్యోగులు నర్సింహులు, సుజాత, రవీందర్ రెడ్డి, చైతన్య, సూపరవైజర్ గోవర్ధన్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని మహిళా ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరుపేద మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ



నర్సంపేట, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : నర్సంపేట పట్టణంలో మంగళవారం రోటరీ క్లబ్ అధ్యక్షులు బొద్దురెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు బుధరావుపేట గ్రామం యందు జిల్లా ప్రజా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు విద్యలో భాగంగా ఆర్థిక స్వావలంబనలో కుట్టు శిక్షణలో భాగంగా ఆరు కుట్టుమిషన్లను రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్, నర్సంపేట వారి ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని ఇద్దరు పేద మహిళలకు ఇటుకలపల్లి గ్రామంలోని మహిళలు ఇద్దరికీ ఉపాధి కల్పనలో భాగంగా ఉచితంగా అందజేశారు. కుట్టుమిషన్లను రొటేరియన్ నండ్యాల కృష్ణారెడ్డి సహకారంతో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు బొద్దిరెడ్డి నరసింహ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద మహిళలు ఆర్థిక ఎదుగుదల బాలికలు విద్యతోపాటు వృత్తి విద్యా నైపుణ్యాలు పొందడానికి ఈ మిషన్లను అందిస్తున్నట్లు తెలిపారు. రోటరీ చార్టెడ్ ప్రెసిడెంట్ గోపు జయపాల్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ చేపడుతున్న సేవ కార్యక్రమాలను వివరించారు ఈ కార్యక్రమంలో నండ్యాల కృష్ణారెడ్డి, రోటరీ సెక్రెటరీ సిద్ద సుధాకర్, రోటరీ పూర్వ అధ్యక్షులు గుడిపూడి పవన్ కుమార్ నరేందర్, రాజశేఖర్, వంగ రాజేందర్ ఇంకా రోటరీ బాధ్యులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భద్రయ్య సహా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు కుట్టు శిక్షణ ట్రైనర్ బాల బాలికలు పాల్గొన్నారు

ఫౌష్టికాహారంతో చిన్నారుల్లో చురుకుదనం



నర్సంపేట, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : చిన్నారులకు నాణ్యమైన ఫౌష్టికాహారం అందించడం ద్వారా వారిలో చురుకుతనం పెంపొందుతుందని వల్లభ్ నగర్ అంగన్వాడి టీచర్ కే.వాణి అన్నారు. నర్సంపేట డివిజన్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపాలిటీ పరిధిలోని వల్లభ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో గల అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్ కే.వాణి చిన్నారులకు విద్యతో పాటు వివిధ ఆక్టివిటీ కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ నెల మంచి మాటలు అనే అంశంపై గుడ్ మార్నింగ్ చెప్పడం, గుడ్ ఆఫ్టర్ నూన్ అని చెప్పడం, చెప్పులు వరసలో పెట్టడం అని చిన్నారులు తెలిపారు. అంగన్వాడి టీచర్ వాణి మాట్లాడుతూ మంచి అలవాట్లు, సంభాషణ, పాటలు పూర్వ గణిత భావనలు, శాస్త్రీయం పరిజ్ఞానం, ఆటలు,కథలు, సృజనాత్మకత, భాషా పరిచయం వంటి అత్యంత ముఖ్యమైన విషయాల పట్ల నేర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రం ప్రారంభం!



మట్టెవాడ, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు మంగళవారం 29, 11వ డివిజన్ పరిధిలోని పాపయ్యపేట చమన్ ప్రాంతంలో కల్పలత సూపర్ బజార్ మాజీ వైస్ చైర్మన్ ఎండి.షఫీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. రానున్న రోజుల్లో ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్యయుత హక్కును సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సదాంత్, డివిజన్ సీనియర్ నాయకులు ప్రసాద్, రాము, చందు, అక్బర్, జావీద్, రాజు, బీమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా అశోక్



ఆత్మకూరు, అక్టోబర్ 27(పీపుల్స్ డైరీ) : పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఆత్మకూరు మండలానికి చెందిన జమాండ్ల అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నల్లగొండ జిల్లాలో నిర్వహించిన సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయనను ఈ పదవికి ఎన్నుకున్నారు. 2002లో పీఆర్ టీ యూలో క్రియాశీల సభ్యుడిగా చేరిన అశోక్ వివిధ మండలాల్లో కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, ప్రస్తుత హనుమకొండ జిల్లాలోని ఆత్మకూరు మండల అధ్యక్షుడిగా మూడుసార్లు పనిచేశారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శి బట్టాపురం మధుసూ దన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్కిరెడ్డి మహేందర్, సురేందర్, వెంకన్నలకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

మండలంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

కేసముద్రం, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి మంగళవారం కేసముద్రం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రాంచందర్ నాయక్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ పాల్గొన్నారు.

కస్తూరిబా పాఠశాల భవనం ప్రారంభం:

అనంతరం కేసముద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల భవనాన్ని ఘనంగా ప్రారంభించారు. ఆడబిడ్డల చదువు కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఈ నూతన భవనం ద్వారా విద్యార్థినులకు మెరుగైన వసతి, భద్రత లభిస్తుందని అన్నారు. తరగతి గదులు, వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థినులతో మమేకమయ్యారు.

ఉప్పరపల్లిలో విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభం

ఈ పర్యటనలో ప్రధాన ఘట్టంగా ఉప్పరపల్లి గ్రామంలో మూడున్నర కోట్ల రూపాయలతో నిర్మించిన 33/11 విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ఉప కేంద్రం ద్వారా ఉప్పరపల్లి, అర్పణపల్లి, వెంకటగిరి, ఇంటికన్నె, కాట్రపల్లి, కొత్త చెరువు తండా, ముత్యాలమ్మ తండా, చశీద్రు తండా గ్రామాలకు ప్రయోజనం చేకూరనుంది. వినియోగదారులకు

ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ వేం నరేందర్‌రెడ్డి





లబ్ధి చేకూరనుందని, తెలిపారు. ఈ ఉప కేంద్రం రాకతో తక్కువ విద్యుత్ సమస్య తీరిపోయిందని, రైతులకు నిరంతర నాణ్యమైన విద్యుత్ అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల చిరకాల కోరికను నెరవేర్చిన ఘనత వేం నరేందర్ రెడ్డికే దక్కుతుందని స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్, స్నేహ శబరీష్ ఉప్పరపల్లి గ్రామ సర్పంచ్ సునీత కుమారస్వామి మార్కెట్ చైర్మన్ గంట సంజీవ రెడ్డి చైర్మన్ సునీత వెంకన్న వైస్ చైర్మన్ అల్లం రమ నాగేశ్వరావు అంబటి మహేందర్ రెడ్డి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సమ్మీ గౌడ్ నీలం దుర్గేష్ బండారు వెంకన్న దయాకర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి



ఆత్మకూర్, అక్టోబర్ 27(పీపుల్స్ డైరీ) : నల్గొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి పట్టభద్రున్ని ఓటరుగా నమోదు చేయించాలని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి సూచించారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలో పార్టీ నాయకులు, గ్రామాల ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఓటరు నమోదుపై వారికి దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించేలా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటు కీలకమని, ఈ నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని గ్రామాల వారీగా సమన్వయంతో చేపట్టాల ని సూచించారు. ఓటరు నమోదుకు అర్హత ఉన్నవారికి ప్రక్రియపై అవగాహన కల్పించాలని, కొత్త ఓటర్ల నమోదులో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని నాయకులకు తెలిపారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేస్తూ నమోదుకు అర్హులైన పట్టభద్రులందరికీ సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, మండల సమన్వయ కమిటీ సభ్యుడు సావురే రాజేశ్వరరావు, మాజీ యూత్ అధ్యక్షుడు బత్తిని వంశీగౌడ్, మాజీ యూత్ కార్యదర్శి మందపెల్లి మధుకర్, టౌన్ మాజీ అధ్యక్షుడు పాపని రవీందర్, మాజీ సర్పంచి వంగాల భగవాన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంకూస్, మాజీ బీసీ సెల్ అధ్యక్షుడు బాషబోయిన సాగర్, కొమ్ము కుమారస్వామి, గ్రామ ఇన్‌చార్జులు, పార్టీ ముఖ్య నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 16 మందికి జరిమాన

మట్టెవాడ, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ): వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి, ట్రాఫిక్ అదనపు డీసీపీ ఆర్.ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసిపి టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 16 మంది వ్యక్తులను వరంగల్ సెకండ్ క్లాస్ కోర్టు 3వ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అంకేశ్వరపు కమలాకర్ ఎదుట హాజరుపరచగా 16 మంది వ్యక్తులకు కోర్టు రూ.15,200 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురు వాహన దారులకు కోర్టు రూ.2,000 జరిమాన విధించినట్లు సీఐ సుజాత వెల్లడించారు.

పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలి

పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్



ఆత్మకూరు, అక్టోబర్ 27(పీపుల్స్ డైరీ) : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకుల సమక్షంలో నూతన గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చేందుకు యువత సైనికుల్లా పనిచేయాలని అన్నారు. బీజేపీ పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వా మ్యానికి విఘాతం కలుగుతోందని ఆయన విమర్శిం చారు. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకొని బీజేపీ అక్రమాలకు పాల్పడుతూ అధికారంలోకి వస్తోందని విమర్శించారు. ఈ అంశాలపై యువత ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచనల మేరకు గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీలు పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేవూరి జలంధర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పర్వతగిరి మహేశ్వరి రాజు, పీఏసీఎస్ చైర్మన్ ఎగితే లింగ య్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తను గుల సందీప్, గఫూర్, మౌలా, రాజేందర్, రమేష్, గ్రామ అధ్యక్షులు తాళ్ల కిరణ్, అర్షం కుమారస్వా మి, ఎలగొండ లింగమూర్తి, మంగ రాజు, సీనియర్ నాయకుడు పరికరాల వాసు, డైరెక్టర్లు వెల్దే వెంకటేశ్వర్లు, రవి, ఉడత మహేందర్, రాజేందర్, నీలం రాజు, కుమారస్వామి, యూత్ నాయకులు పిట్టల రాజకుమార్, కరీం తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బ్యాటరీల దొంగ అరెస్ట్

రూ.20 వేల విలువైన రెండు బ్యాటరీలు స్వాధీనం



ఆత్మకూరు, అక్టోబరు 27(పీపుల్స్ డైరీ) : టిప్పర్ వాహనాల బ్యాటరీలను దొంగిలించిన కేసులో ఓ వ్యక్తిని ఆత్మకూరు పోలీసులు అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి రూ. 20 వేల విలువైన రెండు బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు ఆత్మకూర్ సీఐ బాబులాల్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం గత జులైలో గూడెపాడ్ జంక్షన్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద రేగొండ మండలానికి చెందిన మేకల భాస్కర్‌రెడ్డి టిప్పర్ వాహనంలో ఉన్న రెండు బ్యాటరీలను నిందితుడు దొంగిలించాడు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం (అక్టోబరు 26) గూడెపాడ్ జంక్షన్‌లోని రాజ రాజేశ్వరి పంక్చర్ షాపు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడు వరంగల్‌లోని కాశీబుగ్గకు చెందిన పస్తం ఐలుకుమార్ (35)గా గుర్తించారు. అతడి నుంచి చోరీకి గురైన రెండు బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మంగళవారం పరకాల కోర్టులో హాజరుపరచనున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమం లో హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరణ్, మహిళా కానిస్టేబుల్ ప్రవళిక, హోంగార్డు రామన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పెండెం కట్టయ్య సేవలు వెలకట్టలేనివి

నర్సంపేట, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : ప్రముఖ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత స్వతంత్ర సమరయోధుడు కాంగ్రెస్ పార్టీకి పెండెం కట్టయ్య చేసిన సేవలు వెలకట్టలేనివి, కరుడు గట్టిన కాంగ్రెస్ నేత, పెండెం కట్టయ్య సేవలు చిరస్మరణీయమని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చింతల సాంబరెడ్డి, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పంబి వంశీకృష్ణ, నర్సంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, జిల్లా అధికార ప్రతినిధి ఎర్ర యాకూబ్ రెడ్డి తెలిపారు. మంగళవారం నర్సంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో పెండెం కట్టయ్య 29వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెండెం కట్టయ్య విగ్రహానికి వారి రాజకీయ వారసుడు మనుమడు తెలంగాణ రాష్ట్ర పీసీసీ సభ్యులు పెండెం రామానంద్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల సాంబరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్, జిల్లా అధికార ప్రతినిధి ఎర్ర యాకూబ్ రెడ్డి మాట్లాడుతూ కీర్తిశేషులు పెండెం కట్టయ్య తన తుది శ్వాస ఉన్నంత వరకు ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, కౌన్సిలర్లు ముత్తినేని వెంకన్న, ఎలకంటి విజయ్ కుమార్, మాదాసి రవి, సలావుద్దీన్ అయూబ్ ఖాన్, కాంపెల్లి వీణ విజేందర్ రెడ్డి, బాణాల ప్రసన్న శ్రీనివాస్, వేల్పుల శ్రీలత, పొన్నాల మనీషా ప్రకాష్, చీకటి స్వరూప ఓదయ్య గౌడ్, ఇస్లావత్ రామా గోపి నాయక్, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపెల్లి సందీప్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరి మురళి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ధోని కీర్తన, మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శులు



చిప్ప నాగ, మోటం రవి, నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంత రంజిత్, నర్సంపేట పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్కే షఫిక్, సొసైటీ డైరెక్టర్లు కీసర వెంకటేశ్వర్లు, లాక్కార్స్ రమేష్, చిప్ప లక్ష్మణ్, మాజీ ప్రజా ప్రతినిధులు కాట ప్రభాకర్, గాజుల రమేష్, పేరం బాబురావు, అజ్మీర శంకర్ నాయక్, గండి గిరి, వార్డు అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపెల్లి శ్రీనివాస్, కోల చరణ్ గౌడ్, బిట్ల మనోహర్, మెరుగు కిరణ్, అప్పాల శ్రీకాంత్, మహదేవుని రాజ్ వీర్, కాట అఖిల్, నూనె పద్మ, కొంకిస అరుణ, గద్ద జ్యోతి, బీరం భాస్కర్ రెడ్డి, కీసరి నరేందర్, సదానందం, గద్ద అఖిల్, కాట రాహుల్, దేశి సాయి పటేల్, దేశి లక్ష్మి, కీసర రాజీవ్, ఉప్పుల షాలోమ్, చీకటి శివమణి, సాగర్, అభి, రాకేష్ పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
బుధవారం, 28 అక్టోబర్ 2026
సంపుటి : 18, సంచిక : 217



పేకాట స్థావరంపై పోలీసుల దాడి

7 గురిపై కేసు నమోదు - నగదు, మొబైల్ ఫోన్‌లు స్వాధీనం

గణపురం, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : మండలంలోని చెల్పూర్ గ్రామ శివారులో నమ్మదగిన సమాచారం మేరకు సిసిఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ మేరకు పేకాట ఆడుతున్న 7 గురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారిని తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడిలో పేకాటకు ఉపయోగించిన సెల్‌ఫోన్లు,రూ 7690 రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకునీ కేసు నమోదు చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని పోలీసులు కోరారు.

రోగులకు పండ్ల పంపిణీ



చిట్యాల, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన యువకుడు గుండ్ల హర్షిత్ తన జన్మదినం సందర్భంగా చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మంగళవారం పండ్లు, వాటర్ బాటిల్ డ్యూటీ డాక్టర్ క్రాంతి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం హర్షిత్ మాట్లాడుతూ ఎవరి పుట్టినరోజు వేడుక జరిగినగాని పేదవారికి కడుపు నిండే విదంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ నర్సింగ్ ఆఫీసర్స్ కవిత రాధా శ్రావ్య ఎస్ఎస్కె ఎన్జీవో చైర్మన్ సర్వ శరత్ కుమార్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల్లో బీసీలకు అవకాశం కల్పించాలి

బీసీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్



హన్మకొండ, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : ఎన్నికల ముందు బీసీల జపం చేసి అధికారంలోకి వస్తే విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని నమ్మబలికి కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను నమ్మించి బీసీల ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చాక బీసీల వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక వైఖరిని మార్చుకొని వచ్చే నెలలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న మూడు ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవుల్లో రెండు నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవులను బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న ఎమ్మెల్సీ పదవుల్లో అర్హత సామాజిక సేవ పార్టీ పట్ల నిబద్ధత కలిగిన బీసీ నాయకులకు అవకాశం కల్పించాలని వేణుగోపాల్ గౌడ్ కాంగ్రెస్ అధిష్టానానికి సూచించారు.

పందుల బెడద నుండి కాపాడండి

అధికారులకు రైతు ఫిర్యాదు



చిట్యాల, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీ సమీప హెచ్‌పి గ్యాస్ గోదాం ఎదురుగా నివసిస్తున్న శీలపాక నరసయ్య అనే రైతు తన ఆయిల్ పామ్ మరియు కూరగాయల తోటలో గత కొంతకాలంగా పందుల బెడద తీవ్రంగా పెరిగిందని సుమారు 50-60 పందులు గుంపులుగా వచ్చి పంటలను పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయని దీనివల్ల తనకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందని పందుల బెడద నుండి తన పంటలను కాపాడాలని ప్రజావాణిలో తన తరపున తన కుమారులు ఫిర్యాదు చేశారని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు పందులను నియంత్రించేందుకు తగినచర్యలు తీసుకొని అలాగే మా పంటలను, గ్రామ ప్రజలను రక్షించవలసిందిగా కోరారు.

యువత మాదవద్రవ్యాలు సేవించొద్దు

చిట్యాల, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : చిట్యాల గ్రామ సర్పంచ్ సూచన మేరకు రామ్ నగర్ కాలనీ 11 వ వార్డ్ సభ్యులు వేల్పుల లక్ష్మీ - బాపు ఆధ్వర్యంలో మంగళవారం డ్రగ్స్ నిర్మూలన గంజాయి వలన నష్టాలపై వినూత్న కార్యక్రమం చేపట్టారు. దీనికి సంబంధించి ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ గుడుంబా మరియు డ్రగ్స్ రహిత కాలనీ కోసం ఇలాంటి ప్రయత్నం చేయడం అభినందనీయమని యువకులు మాదకద్రవ్యాలు సేవించకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు మైదం శ్రావ్య- శ్రీకాంత్ శనిగరపు మొగిలి కాలనీ వాసులు గురుకుంట్ల కిరణ్ కట్కూరి రాజు వెంకట్ శశి వర్ధన్ బన్నీ నాగేంద్రబాబు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





మొగుళ్ళపల్లి, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ): మండలంలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.2 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మండలంలోని కొరికిశాల, బద్దం పల్లి జిపి, అంగన్వాడి భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇప్పలపల్లి, పర్లపల్లి, మొగుళ్లపల్లిలో మహిళా సమైక్య భవనాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పెద్దకోమటిపల్లిలో గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాలు, అంకుశాపూర్‌లో మహిళా సమైక్య, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మేదరమెట్లలో గ్రామపంచాయతీ, మహిళా సమైక్య భవనాలు, ఇసిపేటలో అంగన్వాడీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామపంచాయతీ, అంగన్వాడీ, మహిళా సమైక్య భవనాల నిర్మాణంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ అవుతాయని తెలిపారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏల గౌరవ వేతనం పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలి



కేసముద్రం, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : తెలంగాణ రాష్ట్రంలోని ఐకేపీ వీవోఏల గౌరవ వేతనం పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డికి తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం తరపున వినతి పత్రం అందజేశారు. తాము రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,606 మంది వీవోఏలుగా వివిధ గ్రామాల్లో మహిళా సంఘాల సహాయకులుగా గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, గ్రామీణ మహిళలకు సామాజిక, ఆర్థిక, విద్యా పరంగా అభివృద్ధికి తోడ్పడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన మహిళలకు చేరేలా క్షేత్రస్థాయిలో నిరంతరం సేవలందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం తమకు కేవలం నెలకు 5 వేల రూపాయల గౌరవ వేతనంతో విధులు నిర్వహిస్తున్నామని, ఈ మొత్తం ప్రస్తుత జీవన వ్యయానికి ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. అంతేకాకుండా తమ గౌరవ వేతనానికి గ్రేడింగ్ విధానాన్ని అనుసంధానం చేయడం వల్ల పలు చోట్ల గ్రేడింగ్ పేరుతో వేతనాలు నిలిపివేయడం జరుగుతుందని, ఈ గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసి ప్రతి వీవోఏకు క్రమం తప్పకుండా గౌరవ వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, సంబంధిత ప్రభుత్వ శాఖలతో చర్చించి డిమాండ్లను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం తరపున వేడుకున్నారు. కార్యక్రమంలో సాంబయ్య నెహ్రూ కళావతి లావణ్య రవి పాల్గొన్నారు.

వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి జాడి బాబురావు



గణపురం, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : సూపర్ ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం లోటు, నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి జాడి బాబురావు సూచించారు. మంగళవారం మండలంలోని చెల్పూర్ రైతు వేదికలో ఏవో దేశ బోయిన ఐలయ్య ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా భూసంరక్షణ ఆవశ్యకతపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా వారు ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడుతూ... నీటి లభ్యత,నేల స్వభావం,స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఆరుతడి పంటలుగా జొన్న,సజ్జ,రాగి,మొక్కజొన్న, కంది,పెసర,మినుము,శనగ, వేరుశనగ, నువ్వులు, ఆముదం వంటి పంటలను అనుకూల పరిస్థితుల్లో సాగు చేసుకోవచ్చని వివరించారు. ఆరుతడి పంటల ఎంపికను స్థానిక వర్షపాతం,నేల రకం, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా డిహెచ్ఎస్ఓ,టిఆర్ వికె శాస్త్రవేత్త మదన్ మోహన్ రెడ్డి, ఏఈఓలు కళ్యాణ్, అమూల్య,పాక్స్ గణపురం, చెల్పూర్ సీఈఓలు పుట్ట సురేష్, రవి, రైతులు సుంకరి సుధాకర్ రెడ్డి,చిత్తారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు కొమురం భీమ్‌కు ఘన నివాళి

అంబేద్కర్ సెంటర్‌లో నివాళులర్పించిన పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు



మణుగూరు అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వ యం ప్రతిపత్తి కోసం అలుపెరగని పోరాటం సాగించిన ఆదివాసీ వీరుడు కొమురం భీమ్ వర్ధంతిని పురస్కరించుకుని మణుగూరులో ఘనంగా నివాళులర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని అంబేద్కర్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ చేసిన త్యాగాలను, ఆదివాసీ సమాజ హక్కుల సాధన కోసం ఆయన సాగించిన పోరాటాన్ని స్మరించుకున్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కులు, స్వేచ్ఛ కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్‌తో పాటు జిల్లా ముఖ్య నాయకులు, దివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కొమురం భీమ్ సేవలను, త్యాగాలను స్మరించుకుంటూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

రైతు ఉత్పత్తి సంఘాలకు సబ్సిడీ యంత్రాలు



గీసుకొండ, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : నవంబర్ 30 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఖేత్ బచావో అభియాన్" రైతు సమగ్ర శిక్షణ ఉద్యమం కార్యక్రమం రైతునేస్తంలో భాగంగా కొనాయమాకుల రైతువేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయభాస్కర్ మాట్లాడుతూ పిఏసిఎస్ లు, ఎఫ్ పి ఓలు, ఎస్‌హెచ్‌జిలు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎస్.ఎం.ఎ.ఎం. పథకం కింద కస్టమ్ హైరింగ్ సెంటర్లను నెలకొల్పడానికి ముందుకు రావాలన్నారు. ఖేత్ బచావో అభియాన్ ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ, నీరు-ఎరువుల ఖర్చులను తగ్గించి, రైతులకు స్థిరమైన నికర ఆదాయాన్ని సాధించిపెట్టడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, ఇందులో భాగంగా రైతులు సమతుల్య ఎరువుల వాడకం, రసాయనాల భారాన్ని తగ్గించే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం, పంట అవశేషాలను కాల్చివేయకుండా నేలలో కలియదున్నడం లేదా మల్చింగ్ చేయడం వంటివి చేయాలని సూచించారు. ప్రాజెక్టు డైరెక్టర్ (ఆత్మ) విజయనిర్మల మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు రైతు ఉత్పత్తి సంఘాలకు అవసరాన్ని బట్టి వివిధ పంటలపై సాగు విధానాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి కె. రమేష్ , జిల్లా పశు వైద్యాధికారి టి.బాలోజి, వర్ధన్నపేట ఏ.డి.ఏ., జి.నర్సింగం, వ్యవసాయ అధికారులు సిహెచ్ కృష్ణారెడ్డి, ఎన్.రవీందర్, పి హరి ప్రసాద్ బాబు, పశు వైద్యాధికారి శ్రీకాంత్ రెడ్డి, ఏఈఓలు భరత్, స్మిత, డిఆర్‌డిపి ఏపీడి, ఏపీఎం ఈశ్వర్, కొనయమాకుల సర్పంచ్ వజ్ర రాజు, కార్యదర్శి రామారావు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గణపురం, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : బాలల పరిరక్షణతోనే దేశానికి బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని సీనియర్ సివిల్ జడ్జి తాడూరు మహతి వైష్ణవి అన్నారు. జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం గణపురం మండలంలోని గాంధీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ బాలికల వసతి గృహంలో 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బాలల రక్షణ, హక్కులు, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మహతి వైష్ణవి మాట్లాడు తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో మొబైల్ ఫోన్ల వినియోగంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైన మేరకే ఫోన్‌ను వినియోగి స్తూ, సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా చెల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మరో అవగాహన కార్యక్రమానికి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ అశోక్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటస్వామి, సూపరింటెండెంట్ రఘురాం, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, గోపాల్, రాజ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బియ్యం ధరల దోపిడికి అడ్డుకట్ట వేయాలి : మల్లేష్

చిట్యాల, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : ఎల్‌నినో ప్రభావంతో దిగుమతి తగ్గిందనే సాకుతో బియ్యం ధరలు అడ్డగోలుగా పెంచి విక్రయిస్తున్న వ్యాపారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని బియ్యం ధరల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం టేకుమట్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో మాట్లాడుతూ ప్రకృతి పరిస్థితులను ఆసరా తీసుకొని కొంతమంది వ్యాపారులు బియ్యం నిల్వలను అక్రమంగా దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించి సామాన్య మధ్యతరగతి ప్రజల పైన విపరీతమైన భారాలను మోపుతున్నారని ఒక కిలో బియ్యం 90 నుండి 100 రూపాయలకు అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. నిత్య అవసర సరుకుల పైన విపరీతమైన ధరల పెంచుతున్నారని మధ్యతరగతి సామాన్య ప్రజలు కొనుగోలు చేసే శక్తి లేకుండా చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రతి నిత్యవసర వస్తువు పైన విపరీతమైన రేట్లు పెంచుతుంది అన్నారు. ఒకపక్క పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచడం కాకుండా విపరీతంగా నిత్యవసర సరుకుల ధరలు పెంచుతున్నారని తెలిపారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

మండల ప్రెసిడెంట్ అనిల్



చిట్యాల, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎంపీటీసీ జెడ్పీటీసీ తదితర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చిట్యాల మండల అధ్యక్షులు దబ్బెట అనిల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ దాదాపు మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం గ్రామీణ అభివృద్ధి రైతు సంక్షేమం విద్య వైద్యం యువతకు ఉద్యోగ అవకాశాలు మహిళా సాధికారత వంటి అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కు ఇచ్చిన ఘన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పరిషత్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని కోరారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో అభివృద్ధి న్యాయం ప్రగతి కోసం చేతి గుర్తుకే ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు కార్యకర్తలకు యువతకు విజ్ఞప్తి చేశారు.

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
బుధవారం, 28 అక్టోబర్ 2026
సంపుటి : 18, సంచిక : 217

యాసంగిలో వరి వద్దు

ప్రస్తుత పంటను అన్ని విధాలా కాపాడాలి : మంత్రి తుమ్మల

కరువు పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

వచ్చే ఏడాది జూలై వరకు త్రాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు

నీటి సంరక్షణ పనులు విస్తృతంగా చేపట్టాలి

ఖమ్మం, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత వానాకాలం పంటను అన్ని విధాలా కాపాడాలని, రాబోయే యాసంగి సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులతో ఎల్‌నినో పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా నీటి పారుదల, మిషన్ భగీరథ, వ్యవసాయం, భూగర్భ జలాలు, మార్కెటింగ్, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులు తమ శాఖల ప్రస్తుత పరిస్థితులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... కరువు పరిస్థితులు, మండలాల వారీగా భూగర్భ జలాలు తగ్గుతున్న తీరుపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని అన్నారు. ఈ నెలాఖరు నాటికి, వచ్చే నెలలో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉండబోతుందనే అంచనాలను ప్రజలకు వివరించాలని, అధికారులు ఎప్పటికప్పుడు మీడియా సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రస్తుతం రైతులు ఎంతో కష్టపడి సాగు చేస్తున్న వానాకాలం పంటను కాపాడేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెండవ పంట సాగు చేస్తే రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని, ఈ విషయాన్ని రైతులకు స్పష్టంగా వివరించాలని సూచించారు.

యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం

రాబోయే యాసంగి సీజన్‌లో సాగునీటి లభ్యత ఉండే అవకాశం లేదని మంత్రి తెలిపారు. రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు దూరంగా ఉండాలని, పప్పుధాన్యాలు, చిరు ధాన్యాలు, కూరగాయలు, ఇతర తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని, రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఉద్యాన పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బిందు సేద్యం ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. రెండవ పంటకు సంబంధించి స్థానిక పరిస్థితులను బట్టి తక్కువ నీటితో పండే పంటలకు తడులు అందించే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. ఎక్కడా పంట వ్యర్థాలను తగులబెట్టకుండా చూడాలని, పంట వ్యర్థాలు తగులబెట్టిన ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యం:

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. కిన్నెరసాని నీటిని యాసంగి పంటలకు విడుదల చేయవద్దని, అవసరమైతే మిషన్ భగీరథ త్రాగునీటి అవసరాలకు వినియోగించాలని ఆదేశించారు. నాగార్జునసాగర్ పరిధిలోని రెగ్యులేటర్లు, షట్టర్లు, పంపిణీ వ్యవస్థలను మూసివేసి, పాలేరు వరకు ప్రధాన కాలువల్లో నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువలో మూడు పంప్‌హౌస్‌లను వినియోగించి సాధ్యమైనంత ఎక్కువ నీటిని నిల్వ చేయాలని తెలిపారు. పాలేరు రిజర్వాయర్ మూడు జిల్లాల త్రాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా నీటి నిల్వలను సమర్థంగా నిర్వహించాలని అన్నారు. దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ సమీపంలో ఇసుక బస్తాలతో అడ్డుకట్టను పెంచి సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ ఏడాది నీటి ఆవిరి నష్టాలు, ఇంకుడు నష్టాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సమయాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నియంత్రించాలని, పైపులైన్ల లో లీకేజీలను అరికట్టి నీరు వృథా కాకుండా చూడాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూలై వరకు త్రాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. త్రాగునీటిని వాహనాల శుభ్రత, తోటల పెంపకం వంటి అవసరాలకు వినియోగించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. నీటి వినియోగాన్ని క్రమంగా తగ్గించుకునే అలవాటును ప్రజల్లో పెంపొందించాలన్నారు.



పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాలు, గురుకులాల్లోని పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. అన్ని ఆసుపత్రుల్లో పరిశుభ్రత పాటించాలని, ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 1986లో సుమారు 600 గ్రామాలు వరదల కారణంగా ముంపునకు గురైన సమయంలో ప్రజలకు ఆహారం, త్రాగునీరు అందించి అధికారులు సమర్థంగా పనిచేశారని మంత్రి గుర్తుచేశారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... గత సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లాలో 10 మండలాల్లో తీవ్ర కరువు, 7 మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నాయని వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే భూగర్భ జలమట్టాలు సుమారు 2 మీటర్లు తగ్గిపోయాయని పేర్కొన్నారు. కామేపల్లి, మధిర, ఏన్కూరు, సత్తుపల్లి, ఎర్రుపాలెం మండలాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయని, ఆయా ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా, లంకాసాగర్ జలాశయాలను నింపుకోవడంతో పాటు నాగార్జునసాగర్ ఆయకట్టుకు కొంతమేర సాగునీరు అందించగలిగామని వివరించారు. రాబోయే యాసంగి సీజన్‌కు సాగునీరు అందుబాటులో లేదని, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లా వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులున్నారు.



పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత

ఖమ్మం, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : విధి నిర్వహణలో భాగంగా త్రీ టౌన్ లో భాద్యతలు నిర్వహిస్తూ ఈ ఏడాది ఆగస్టు 23న మరణించిన ఎస్సై డి.అనంతరాములు కుటుంబ సభ్యులకు పోలీసు సిబ్బంది సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా నిలవడం పోలీస్ శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అమూల్యమైన ప్రాణాలను కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో కళావతి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు హేమనాథ్ పాల్గొన్నారు.

రాముకు సిపిఎం నేతల నివాళి



ఏన్కూర్, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : ఏన్కూర్ మండల పరిధిలోని భగవాన్ నాయక్ తండాకు చెందిన గుగులోత్ రాము హెవీ వాటర్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. ఈ విషాద వార్త తెలుసుకున్న సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం భగవాన్ నాయక్ తండాకు చేరుకుని, పార్టీ మండల నాయకులతో కలిసి రాము భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను, బంధువులను, మిత్రులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం వైరా డివిజన్ కమిటీ సభ్యులు బానోత్ బాలాజీ, ఏర్పుల రాములు, మండల నాయకులు తమ్మినేని వెంకటయ్య, ఇంజం వేణు, గిరిజన సంఘం నాయకులు బానోత్ హరిచంద్, ధారావత్ నంద్యా నాయక్, బానోత్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొని గుగులోత్ రాముకు నివాళులర్పించారు.

నంబర్ ప్లేట్స్ లేని 4 ట్రాక్టర్‌లపై కేసు నమోదు



చిట్యాల, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : మంగళవారం ఉదయం జడల పేట క్రాస్ రోడ్డు వద్ద వాహన తనికి చేస్తుండగా గిద్దము త్తారం నుండి భూపాలపల్లి వెలుతున్న 4 ఇసుక లోడ్ ట్రాక్టర్లును ఆపి వారి అనుమతి పత్రములు బండి పేపర్లు మరియు లైసెన్సులు అడగ్గా వారి వద్ద లేవని తెలిపిన ట్రాక్టర్ డ్రైవ రు, ఓనర్లు అయిన నేరేడుపల్లి గ్రామానికి చెందిన దువ్వాల ఉమేష్ గొర్లవీడు గ్రామానికి చెందిన సంగ ప్రవీణ్ నేరేడుపల్లి గ్రామానికి చెందిన గాజు దేవేందర్ నాచారం గ్రామానికి చెందిన చెనావేణి రమేష్ ఓనర్ మెట్టు రజనీకాంత్, కొత్తపల్లి భూపాలపల్లికి చెందిన ఒర్సు రాజేందర్ ఓనర్ గుగులోతు రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పోచంపల్లి సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సుధాకర్‌రావుకు 'నేషనల్ బిజినెస్ అచీవ్‌మెంట్ ఐకాన్' అవార్డు

ఏన్కూరు, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : సామాజిక సేవా రంగంలో విశేష సేవలు అందిస్తున్న తిమ్మారావుపేట నివాసి ఏర్పుల సుధాకర్ రావు జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో డాక్టర్ రమేష్ కావలి ఆధ్వర్యంలో నిర్వహించిన 'నేషనల్ బిజినెస్ ఐకాన్ అచీవ్‌మెంట్ అవార్డ్స్' వేడుకలో ప్రముఖ సినీ నటి హెబ్బా పటేల్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి 26 సార్లు రక్తదానం చేయడంతో పాటు, హైదరాబాద్, భద్రాచలం, విజయవాడ వంటి సుదూర ప్రాంతాలకు స్వయంగా వెళ్లి ఉచితంగా రక్తదానం చేసి ఆయన ప్రాణదాతగా నిలిచారు. అలాగే కరోనా సమయంలో వలస కూలీలకు నిత్యావసర సరుకులు అందించి, సొంతూర్లకు చేరేలా సాయం చేశారు. ఈ సేవలను గుర్తించి చైర్మన్ డాక్టర్ రమేష్ కావలి, సినీ నటి హెబ్బా పటేల్ ఆయనను సన్మానించారు



సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి



మట్టెవాడ, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితారెడ్డి హన్మకొండ జిల్లా పరిషత్తు ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌ను సందర్శించి అందులో వయో వృద్ధులకోసం ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్లినిక్, లీగల్ ఎయిడ్ క్లినిక్, లైబ్రరీ ఎలా నడుస్తుందో పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. సీనియర్ సిటిజన్స్ కోసం లీగల్ సలహాలు, సూచనల కోసం సంప్రదించడా నికి ఎంత మంది వస్తున్నారు ఎన్ని కేసులు నచ్చాయి, కౌన్సిలింగ్‌కి ఎంతమంది వస్తున్నారు అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు ద్వారా వృద్ధులకు మరిన్ని సేవలు అందిద్దాం అని, సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిద్దాం అని, అన్ని డిపార్ట్‌మెంట్స్ కన్వర్జెన్సీతో వయోవృద్ధుల కోసం పని చేద్దామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉష, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ టీవీల పంపిణీ



కేసముద్రం, అక్టోబర్ 27 (పీపుల్స్ డైరీ) : మండలం ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ టీవీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ ఇన్ఫోసిస్టమ్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు 10 డిజిటల్ టీవీలను రాజ్యసభ సభ్యులు, సీఎం సలహాదారు వేము నరేందర్ రెడ్డి మరియు పార్లమెంటు సభ్యులు బలరాం నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేము నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్య అందించేందుకు చేతన ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులు వెనిగళ్ళ వెంకటేశ్వరరావు, ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, తాతా గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాట్రగడ్డ చంద్రశేఖర్ వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి!

అశ్వాపురం--మణుగూరు జోనల్ స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

నెల్లిపాక బంజర, అక్టోబర్ 27 (పీపుల్ డైరీ) : విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సాహం అందించాలని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే విద్యార్థులకు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం నెల్లిపాక బంజర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అశ్వాపురం--మణుగూరు జోనల్ స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలీబాల్ పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే.. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు క్రీడలు ఎంతో కీలకం

విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని పాయం వెంకటేశ్వర్లు సూచించారు. క్రీడలు కేవలం బహుమతులు సాధించడానికి మాత్రమే కాకుండా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, పట్టుదల, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందించడానికి దోహదపడతాయని వివరించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచడంతో పాటు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎంతో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు, తగిన శిక్షణ, ప్రోత్సాహం లభిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే సామర్థ్యం ఉందని అన్నారు.



పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలి

అశ్వాపురం--మణుగూరు జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని పాఠశాలలకు, గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం, మణుగూరు మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈవోలు), ఎంఆర్పీ, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044, e-mail : peoplesdairydaily@gmail.com

పీపుల్స్‌డైరీ
వరంగల్
బుధవారం, 28 అక్టోబర్ 2026
సంపుటి : 18, సంచిక : 217

కుట్టు మిషన్ల పంపిణీకి ముహూర్తం...

- బీసీ మహిళలకు గుడ్‌న్యూస్...
- మహిళా స్వావలంబనకు అవకాశం
- స్వయం ఉపాధితో జీవితానికి భరోసా
- కసరత్తు షురూ చేయాలంటూ మంత్రి ఆదేశాలు
- డిసెంబర్ 9 నాటికి అందేలా చర్యలు..!

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : మహిళలు ఆర్థికంగా స్థిరపడితేనే ఆ కుటుంబం సగర్వంగా తలెత్తుకుని జీవిస్తుంది. ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారిని మరింత ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళలు ఎవరిపైనా ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడేలా చేసేందుకు ప్రతిష్టాత్మకంగా 'ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల' పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ అద్భుతమైన పథకానికి అనూహ్య స్పందన లభిస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ మేరకు పథకం అమలు, పంపిణీ పురోగతిపై ఆయన పలు కీలక వివరాలు వెల్లడించారు.

బీసీ మహిళలకు కుట్టు మిషన్లు అందించే ఈ ఉపాధి పథకం కోసం ఏకంగా 4.80 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో మహిళల్లో స్వయం ఉపాధి పట్ల ఉన్న అమితమైన ఆసక్తికి ఈ దరఖాస్తుల వెల్లువ ఒక నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులందరికీ త్వరలోనే కుట్టు మిషన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా వచ్చే నెల డిసెంబర్ 9వ తేదీన ప్రతి జిల్లాలో లబ్ధిదారుల చేతుల్లో కుట్టు మిషన్లు పెట్టాలని ప్రభుత్వం దృఢంగా నిర్ణయించింది. ఈ బృహత్తర పంపిణీ కార్యక్రమాన్ని ఒకేసారి రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

పంపిణీకి గడువు సమయం దగ్గర పడుతుండటంతో అధికారులంతా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి ఇటీవల సూచించారు. లక్షలాది మంది మహిళలకు ఏకకాలంలో కుట్టు మిషన్లు అందించాల్సి ఉన్నందున, మిషన్ల కొనుగోలుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను అత్యంత వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యమైన మిషన్లు అందించేలా చూడటంతో పాటు, ఇతర పరిపాలనాపరమైన పనుల్లో ఎక్కడా ఎలాంటి జాప్యం జరగకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. డిసెంబర్ 9 నాటికి అన్ని జిల్లాలకు సరిపడా యంత్రాలు చేరుకునేలా రవాణా ప్రణాళికలను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని సూచించారు. అర్హుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, నిజమైన నిరుపేద బీసీ మహిళలకు న్యాయం జరిగేలా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రి వ్యాఖ్యలతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అర్హులైన వారికి డిసెంబర్‌లో కుట్టుమిషన్లు అందే అవకాశం కనిపిస్తోంది.

ప్రతి ఓటరు ప్రజాస్వామ్య కాపలాదారుడే

- కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య సురేష్ లాల్
- దూరవిద్య కేంద్రంలో ఓటరు చైతన్య సదస్సు



పీపుల్స్‌డైరీ-హనుమకొండ : ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రతి ఓటరు కూడా ప్రజాస్వామ్యాన్ని రక్షించి, కాపాడుకోవాల్సిన కాపలాదారులేనని, మన ఓటు హక్కును మనం నిజాయితీగా ఉపయోగించడం వల్ల ప్రజాస్వామ్యం ఫరిడవీళుతుందని కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య బి. సురేష్ లాల్ అన్నారు.
మంగళవారం దూరవిద్యకేంద్రం ఆవరణలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆచార్య సురేష్ లాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఓటు ఒక మార్పునకు ఆయుధమని, దీనిని మనకోసం, మన అభివృద్ధి కోసం ఉపయోగించాలని, ఓటుతో అధికారాన్ని నిలబెట్టవచ్చు, కూలదోయవచ్చునని, మనకు కావలసిన అభివృద్ధిని సాధించుకోవాలంటే మనం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని అందులో భాగమే ఆత్మసాక్షిగా ఓటు వేసి, బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయాలని, ఓటును అమ్ముకోకుండా నమ్ముకొని, పవిత్రమైన ఓటును ప్రలోభ పడకుండా విక్రమార్కుడిలా ఓటు వేసి నిజాయితీగల వ్యక్తులను గెలిపించుకోవాలని తెలిపారు.
జర్నలిజం శాఖ విభాగాధిపతి ప్రముఖ సామాజిక ఉద్యమకారులు సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ కొరకు ప్రతి ఒక్కరూ సంబంధిత ప్రాంత బిఎల్ఓ లకు వివరాలు అందజేసి ఓటు హక్కును నిలుపుకోవాలని, అదేవిధంగా త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు ప్రతి డిప్లమా, డిగ్రీ చదివిన వ్యక్తులందరూ మరలా ఈ సంవత్సరం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడే ప్రాజెక్టు, గీసుగొండ సబ్ ఇన్స్పెక్టర్ రవీందర్, డాక్టర్ వంగాల సుధాకర్ తోపాటు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ స్థానికులు పాల్గొన్నారు.

పంతులుపల్లి పాఠశాలలో కంప్యూటర్లు ప్రారంభం

నల్లబెల్లి, అక్టోబర్ 27 (పీపుల్స్‌డైరీ) : నల్లబెల్లి మండలంలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం కంప్యూటర్, ల్యాప్ టాప్ ను ప్రారంభించారు. దాతల సహకారంతో, స్థానిక పాఠశాల హెడ్మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి, ఉపాధ్యాయులు కూనమల్ల రాజన్ బాబు సమకూర్చిన కంప్యూటర్, ల్యాప్‌టాప్‌ను స్థానిక సర్పంచ్ ఎరుకల లలిత రఘున, ఎంఈఓ ఎం. అనూరాధ, పిఆర్టీయు టీ ఎస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. వీరితోపాటు ఈకార్యక్రమంలో పాఠశాల ఏఏపిసి చైర్మన్ కదురు లావణ్య, పిఆర్టీయు టీఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఉడుత రాజేందర్, బానోతు కృష్ణ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్ సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.



ఈసందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి మాట్లాడుతూ హన్మకొండకు చెందిన హెడ్ కానిస్టేబుల్ అడ్డూరి రాజనరేందర్ జ్ఞాపకార్థం వారి కూతుళ్ళు కంప్యూటర్ ను పాఠశాలకు బహుకరించినట్లు, అదేవిధంగా అమెరికాలో స్థిరపడిన గీసుకొండకు చెందిన డాక్టర్ పసునూటి స్వాతి- కళ్యాణ్ అనే సైంటిస్ట్ దంపతులు పాఠశాలకు ఫర్నిచర్ ను బహూకరించినట్లు, అదేవిధంగా తన సహోపాధ్యాయుడు కూనమల్ల రాజన్ బాబు కూడా తన సొంత ఖర్చులతో ల్యాప్ టాప్ ను సమకూర్చినట్లు తెలుపుతూ వారికి ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ ఎం. అనురాధ మాట్లాడుతూ పంతులుపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యబోధనలో చక్కని పనితీరును కనబరుస్తూ, దాతల సహకారంతో పాఠశాలకు కంప్యూటర్లు, ఫర్నిచర్ సమకూర్చడం అభినందనీయం అన్నారు. స్థానిక సర్పంచ్ ఎరుకల లలిత మాట్లాడుతూ తమ ఊరి పాఠశాలలో ఇలాంటి ఉపాధ్యాయులు పనిచేయడం తమ గ్రామ అదృష్టం అని పేర్కొన్నారు. పిఆర్టీయు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్ మాట్లాడుతూ పంతులుపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు ఎంతో ముందు చూపుతో విద్యార్థులకు పరిజ్ఞానం అందజేయడం కోసం కంప్యూటర్, ల్యాప్ టాప్ సమకూర్చడం తనకు ఎంతో సంతోషం కలిగించిందనీ, ముమ్ముందు ఈ పాఠశాలలో పిల్లల మౌళిక సదుపాయాల అభివృద్ధికి తన వంతుగా కూడా ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.

విపత్తుల సమయంలో ప్రాణాలు కాపాడేవారే నిజమైన 'ఆపద మిత్రులు'

కమాండెంట్
ఎన్.వి.ఎస్.శ్రీనివాస్ రావు

పీపుల్స్‌డైరీ-వరంగల్ : వరంగల్ మామునూరులోని 4వ బెటాలియన్ ఆవరణలో రెండవ బ్యాచ్ 'యువ ఆపద మిత్ర' శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణా శిబిరాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లా డుతూ... ప్రకృతి వైపరీత్యాలు లేదా ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గోల్డెన్ అవర్‌లో స్పందించే స్థానిక యువతకు సరైన శిక్షణ ఇవ్వడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. 7 రోజుల పాటు సాగే ఈ ప్రత్యేక శిక్షణలో వరంగల్ కి చెందిన 112 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ (యువతి, యువకులు) అన్ని రకాల విపత్తు నిర్వహణ నైపుణ్యాలను నేర్చుకుని, సమాజానికి రక్షకులుగా నిలవాలని ఆయన ఆకాంక్షిం చారు. ఈ 7 రోజుల్లో ఎంపిక చేసిన యువతీ యువకులకు ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్), సి.పి.ఆర్, ఈత, అగ్ని ప్రమా దాలు మరియు వర దల సమయంలో ప్రాణాలను ఎలా కాపాడాలో నిపుణులచే ప్రాక్టికల్ శిక్షణ ఇప్పిస్తారు. విపత్తు సమయాల్లో భయాం దోళనలకు గురికా కుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పద్ధతులపై లైవ్ డెమోలు నిర్వహిస్తారు. వాలంటీర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులతో పాటు విపత్తు రక్షణ కిట్లను అందజేస్తారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సి. వంశీ మోహన్ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, రిజర్వు ఇన్స్పెక్టర్స్ రవి, వెంకటేశ్వర్లు, కృష్ణ, బెటాలియన్ పోలీస్ అధికారులు, శిక్షకులు పాల్గొన్నారు.





నిరంతరాయంగా విద్యుద్దీపాలు



పీపుల్స్‌డైరీ-దేశాయిపల్లి (దుగ్గొండి) : దుగ్గొండి మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుద్దీపాలు నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్తు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ దాటవేస్తున్నారని అంటున్నారు. ఒకపక్క విద్యుత్ ను ఆదా చేయాలని ప్రభుత్వం చెబుతుంటే అధికారులు మాత్రం పట్టించు కోకుండా విద్యుత్తును దుర్వినియోగం చేస్తున్నారని మండిపడుతున్నారు. గ్రామంలో కేబుల్ వైర్లు ఉండడంతో అక్కడక్కడా కాలిపోయి గ్రామంలో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని మొర పెట్టుకుంటున్నారు. కాలిపోయిన కేబుల్ వైర్లతో విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలుగుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. విద్యుత్ సమస్యల పై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వం ఏం పరికరాలు అందివ్వడం లేదని మేం ఏం చేయడానికి లేదని సమాధానం చెబుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కుమార్‌తో పాటు పలువురు కోరుతున్నారు.

మృత్యువులా వచ్చిన చిరుత

- నిద్రపోతున్న కూలీలపై దాడికి యత్నం
- కారు హారన్‌తో కాపాడిన డ్రైవర్...



పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : మహారాష్ట్రలో భయానక ఘటన చోటుచేసుకుంది. రోజంతా కష్టపడి పనిచేసిన వ్యవసాయ కూలీలు ఆరుబయట నిద్రిస్తుండగా ఓ చిరుతపులి అటువైపు వచ్చింది. నిద్రలో ఉన్న వారిపై దాడి చేసేందుకు దూసుకొస్తున్న సమయంలో అటుగా కారులో వెళ్తున్న వ్యక్తి సమయస్ఫూర్తితో వ్యవహరించాడు. పదేపదే హారన్ కొట్టి చిరుతను తరిమేశాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

మహారాష్ట్రలోని గోండియా జిల్లాలో ఉన్న నవేగావ్‌బంధ్ నేషనల్ పార్క్ సమీపంలో ఈ ఘటన జరిగింది. వరి కోతలు, నూర్పిడి పనుల కోసం పంజాబ్ నుంచి కొంతమంది కూలీలు అక్కడికి వచ్చారు. వారితోపాటు మూడు వరి నూర్పిడి యంత్రాలను తీసుకొచ్చారు. అటవీ శాఖ కాలనీ సమీపంలో తాత్కాలికంగా బస ఏర్పాటు చేసుకున్నారు. రోజంతా పొలాల్లో కష్టపడి పనిచేసిన కూలీలు రాత్రి భోజనం చేసి ఆరుబయట నిద్రపోయారు. అయితే, అదే సమయంలో ఓ చిరుతపులి అటువైపు వచ్చింది. చీకట్లో నెమ్మదిగా నడుచుకుంటూ నిద్రిస్తున్న కూలీల దగ్గరకు చేరుకుంది. వారంతా గాఢ నిద్రలో ఉండటంతో చిరుత వచ్చిన విషయాన్ని గుర్తించలేకపోయారు. కొద్దిసేపు అక్కడే ఆగిన చిరుత.. ఒక్కసారిగా కూలీల వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించింది.

అదే సమయంలో అటుగా కారులో వెళ్తున్న మనీష్ నెవారే అనే వ్యక్తి చిరుతపులిని గమనించాడు. కూలీలు ప్రమాదంలో ఉన్నారని గుర్తించి వెంటనే అప్రమత్తమయ్యాడు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన కారుతో చిరుత వైపు వెళ్తూ పదేపదే హారన్ మోగించాడు. హారన్ శబ్దానికి ఉలిక్కిపడిన చిరుత అక్కడి నుంచి పరుగులు తీసింది. మనీష్ తన కారుతో దానిని వెంబడించాడు. కారు హెడ్‌లైట్ల వెలుతురులో చిరుతపులి కనిపిస్తుండగా, దానిని తరిమేందుకు అతడు ప్రయత్నించిన దృశ్యాలు వీడియోలో రికార్డయ్యాయి. సమయానికి మనీష్ స్పందించడంతో నిద్రలో ఉన్న కూలీలు చిరుతపులి నుంచి ప్రమాదాన్ని తప్పించుకోగలిగారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష

పీపుల్స్‌డైరీ-కొత్తగూడెం : కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి న్యాయస్థానం రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన టేకులపల్లి మండలం వెంకట్య తండాకు చెందిన జార్పుల రమేష్, సులానగర్‌కు చెందిన గుగులోతు రమేష్, రాంపూర్‌కు చెందిన గుగులోతు సాయి కుమార్ లపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఈ కేసులను విచారించిన కొత్తగూడెం రెండో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం ముగ్గురు నిందితులకు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి వాహనదారులతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

